


నిర్వహణకు నిధులేవీ?

- జాడలేని మొదటి విడత పాఠశాలల గ్రాంట్లు
- ఎదురుచూస్తున్న హెచ్‌ఎంలు
- కష్టంగా మారిన స్కూళ్ల మెయింటెనెన్స్
- చాక్‌పీసులకు కూడా డబ్బుల్లేని పరిస్థితి
- సొంతంగా ఖర్చుచేసినా మంజూరుకాని బిల్లులు
- గతేడాది పరిస్థితే పునరావృతం

హనుమకొండ, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ బడులను నిధుల కొరత వేధిస్తోంది. సాధారణ కార్యకలాపాలకు కూడా కష్టమవుతోంది. పాఠశాలల నిర్వహణ రోజు రోజుకు భారంగా మారుతోంది. విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలవుతున్నా సర్కారు నుంచి నయాపైసా మంజూరు కాకపోవడంతో నిర్వహణ భారంగా పరిణమిస్తోంది. మూడు నెలలకు ఒకసారి ఇచ్చే నిర్వహణ గ్రాంట్ విషయంలో నిర్లక్ష్య ధోరణి కారణంగా పాఠశాల విద్యపై నమ్మకం సన్నగిల్లుతోంది. ప్రభుత్వాలు మారినా సర్కారు బడుల పరిస్థితి మారడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సర్కార్ బడులను బలోపేతం చేస్తున్నట్లు ప్రభుత్వం చెబుతున్నా... పాఠశాల నిర్వహణకు కనీస నిధులను ఇవ్వడం లేదని, ఈ విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన ధోరణినే ఈ ప్రభుత్వం కూడా అనుసరిస్తోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి ఈ గ్రాంట్‌ను ప్రతీ మూడు నెలలకోసారి విధిగా విడుదల చేయాలి. ఈ విద్యా సంవత్సరంలో మొదటి విడత గ్రాంట్ జూన్ మొదటి వారంలోనే మంజూరు కావాల్సి ఉండగా జూలై నెల కూడా ముగుస్తోంది. ఇప్పటి వరకు అతీగతీ లేదు. నిర్వహణ గ్రాంట్ ఎప్పుడు వస్తుందా అని ప్రధానోపాధ్యాయులు ఎదురుచూస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా నిర్వహణ గ్రాంట్‌ను సకాలంలో విడుదల చేయ లేదు. నిధులన్నీ మురగబెట్టి విద్యాసంవత్సరం ముగుస్తుందనగా ఒక్క సారే ఇచ్చింది. వాటిని సకాలంలో ఖర్చు చేయలేని పరిస్థితి ఏర్పడింది.

ఇబ్బందుల్లో ఉపాధ్యాయులు..

కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇదే ధోరణితో వ్యవహరిస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు నిధులు విడుదల కాలేదు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. మరికొన్ని పాఠశాలల్లో టీచర్లే సొంత డబ్బులు వెచ్చించి కొంత మేర సౌకర్యాలు సమకూర్చుకుంటున్నారు. సాధారణంగా విద్యార్థుల సంఖ్య మేరకు నిర్వహణ గ్రాంట్లు వస్తాయి. 1 నుంచి 30 మంది విద్యార్థులున్న పాఠశాలలకు రూ.10వేల వరకు, 31 నుంచి 100మంది విద్యార్థులున్న స్కూళ్లకు రూ.25 వేలు, 101 నుంచి 250మంది విద్యార్థులున్న బళ్లకు రూ.50వేలు, 251 నుంచి 1000మంది విద్యార్థులున్న పాఠశాలలకు రూ.75వేల వరకు ఇస్తారు.



మొత్తం 4,777 స్కూళ్లు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 4,777 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలున్నాయి. హనుమకొండ జిల్లాలో 865, జనగామ జిల్లాలో 638, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 532, మహబూబాబాద్ జిల్లాలో 1181, ములుగు జిల్లాలో 550, వరంగల్ జిల్లాలో 1011 పాఠశాలున్నాయి. వీటిలో సుమారు 3.27లక్షలకుపైగా విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వం ఏటా నాలుగు విడతలుగా విద్యార్థుల సంఖ్యను బట్టి గరిష్ఠంగా రూ.12500వరకు నిధులను అందించాలి. వాటితోనే పాఠశాలల్లో చాక్‌పీసులు మొదలు హాజరు రిజిస్టర్లు, ఇతర అవసరమైన సామగ్రి, ప్రయోగశాల రసాయనాలను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అయితే ఇప్పటి వరకు నిధులు విడుదల చేయని కారణంగా బడుల నిర్వహణకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ప్రధానోపాధ్యాయులు అంటున్నారు.

క్రీడానిధులెప్పుడు?

విద్యార్థినీ, విద్యార్థులకు క్రీడలతో పాటు ఆత్మరక్షణ శిక్షణలో భాగంగా ఏడాదికి రూ.15వేలు కూడా ఇవ్వాలి. ఈ నిధులు ఎప్పుడు వస్తాయో తెలియదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇటీవల పీఈటీలను పీడీలుగా పదోన్నతులు కల్పించారు. విద్యార్థులకు పలు చోట్ల పరికరాలు లేవు. మైదానాలు చదునుచేయడానికి ఆర్థిక వనరుల అవసరం ఉంటోంది. క్రీడల నిర్వహణకు ఇప్పటి వరకు నిధులు కేటాయించకపోవడంతో అనేక పాఠశాలల్లో విద్యార్థులు ఆటలకు దూరం అవున్నారనే వాదన వినిపిస్తోంది. ఓ పక్కఅట్టహాసంగా ఒలింపిక్ క్రీడలు ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థుల్లో స్వతహాగా క్రీడలపై ఆసక్తి నెలకొంటుండడం సహజం. నిధులు లేకపోవడంతో పీడీలు కూడా నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు.

స్కూల్ కాంప్లెక్సులకు..



ఉమ్మడి జిల్లాలో సర్కారు బడుల్లో మండల రిసోర్సు కేంద్రాలు, పాఠశాల కాంప్లెక్సుల వారీగా ప్రభుత్వం ఏటా నిర్వహణ నిధులను మంజూరు చేస్తోంది. ఒక్కో ఎమ్మార్సీకి ఏడాదికి రూ.90వేలు, ఒక్కో పాఠశాల కాంప్లెక్సుకు రూ.33 వేలుగా నిర్దేశించారు. బడుల సంఖ్యకు అనుగుణంగా రూ.10వేల నుంచి రూ.80వేల దాకా అందిస్తారు. 2020-21 విద్యా సంవత్సరంలో బడులకు సగమే నిధులిచ్చారు. 2021-22లో ముందుగా సగం నిధులు ఇచ్చి మిగతావి మార్చి 31వ తేదీ వరకు మంజూరు చేశారు. ఏప్రిల్‌లో అన్ని బ్యాంకుల్లోని ఖాతాలను విద్యాశాఖ అధికారులు మూసేశారు. ఖర్చుకాని నిధులన్నింటిని వెనక్కి తీసుకున్నారు. 2022-23లో జనవరి వరకు నిర్వహణ నిధులను ఖాతాల్లో వేశారు. 2023-24 విద్యా సంవత్సరం లోనూ పూర్తి స్థాయిలో నిధులు రాలేదు. 2024-25 విద్యా సంవత్సరంలోనైనా ఈ నిధులు పూర్తిస్థాయిలో విడుదలవుతాయా అన్న సందేహం ప్రధానోపాధ్యాయులను వెంటాడుతోంది. ఈ పాటికే కొన్ని నిధులు విడుదల కావలసి ఉండింది. కానీ ఇప్పటి వరకు ఒక్క పైసా రాలేదు.

స్మార్ట్‌సిటీకి రూ.180 కోట్ల కేటాయింపు

అభినందనీయం

- బీఆర్ఎస్ పాలనలో కుంటుపడిన నగరాభివృద్ధి
- కబ్జాకు గురైన ప్రభుత్వ భూములు
- అక్రమంగా బీఆర్ఎస్ కార్యాలయ నిర్మాణం
- బడ్జెట్ సమావేశంలో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



హనుమకొండ సిటీ, జూలై 29 : రాష్ట్ర బడ్జెట్‌లో వరంగల్ స్మార్ట్‌సిటీ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.180 కోట్లు కేటాయించడం అభినందనీయమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో భాగంగా సోమవారం ఆయన అసెంబ్లీలో ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియచేశారు. స్మార్ట్‌సిటీతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాలు, వైకుంఠధామాలు, సమీకృత మార్కెట్ల నిర్మాణం కోసం భారీగా నిధులు కేటాయించడం హర్షణీయమన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో వరంగల్ నగరాభివృద్ధి కుంటుపడిందన్నారు. వర్షాలకు నగరం ముంపునకు గురవ్వడం కారణంగా ప్రజలు నష్టపోయారన్నారు. బీఆర్ఎస్ లోపభూయిష్ట పాలన వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని పేర్కొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏడు నెలల పాలనలోనే ముంపు సమస్యకు పరిష్కార చర్యలు చేపట్టి ఈ మేరకు నిర్మాణాలను జరుపుతున్నట్లు వివరించారు. ఇళ్ల నిర్మాణాల విషయంలో బీఆర్ఎస్ ప్రవేశపెట్టిన జీవోతో సామాన్య ప్రజలు ఇబ్బంది పడుతున్న క్రమంలో జీవోను సవరించాల్సిన అంశాన్ని పరిశీలించాలని ప్రభుత్వాన్ని కోరారు. వరంగల్ పశ్చిమలో బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వ భూములను కబ్జా చేశారని సమగ్ర విచారణకు ఆదేశించి ఆస్తుల పరిరక్షణ చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. హనుమకొండలో బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణమైందని పేర్కొన్నారు. జీడబ్ల్యూఎంసీకి చెందిన పార్కు స్థలంలో కార్యాలయ నిర్మాణం జరిగిందన్నారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబును ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కోరారు.



అక్టోబరులో జూపార్కుకు

పెద్దపులి

- 7లో..

రీ వాల్యుయేషన్ ఫలితాల కోసం

ఎదురుచూపులు

- కేయూ డిగ్రీ సెమిస్టర్ విద్యార్థుల హైరానా
- నిర్ణీత గడువు ముగిసినా ఫలితాల ఊసేలేదు

వివరాలు : 7లో..



నేడు రెండో విడత రైతు రుణమాఫీ

వరంగల్ వ్యవసాయం, జూలై 29: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రైతు రుణమాఫీ లక్ష నుంచి లక్షన్నర లోపు రెండో విడత నిధులను మంగళవారం మధ్యాహ్నం ప్రభుత్వం విడుదలను ప్రారంభిస్తున్నట్లు జిల్లా వ్యవసాయశాఖాధికారి (డీఏవో) ఉషాదయల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు హాజరుకావాలని కోరారు.

శిల్పారామం ఏర్పాటెప్పుడు?

- పద్నాలుగేళ్ల క్రితం మంజూరు
- రూ.6కోట్లు ఇచ్చినా పడని అడుగు

7

చకచకా ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పనులు

వరంగల్ రైల్వేస్టేషన్‌లో ఇనుప దిమ్మెల అమరిక



భారీ క్రేన్‌తో గడ్డర్లను అమర్చుతున్న సిబ్బంది

గిర్మాజీపేట, జూలై 29: అమృత్ భారత్ రైల్వేస్టేషన్ పథకం కింద వరంగల్ రైల్వే స్టేషన్‌లో రూ.25.41కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనుల్లో భాగంగా ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పనులు ఊపందుకున్నాయి. వరంగల్ రైల్వే స్టేషన్‌లో ప్రస్తుతం స్టేషన్ మేనేజర్ కార్యాలయం ముందున్న దశాబ్దాల నాటి 8 మీటర్ల వెడల్పు ఫుట్ ఓవర్ బ్రిడ్జి ప్రయాణికులకు సరిపోవక పోవడంతో 'అమృత్' కింద జీఆర్‌పి స్టేషన్ ముందు మొదటి ప్లాట్‌ఫారంపై 12మీటర్ల వెడల్పుతో కొత్త ఫుట్ ఓవర్‌బ్రిడ్జి పనులు చేపట్టారు. ఒకటి, రెండు, నాలుగవ ప్లాట్‌ఫారాలను అనుసంధానిస్తూ బ్రిడ్జి నిర్మిస్తున్నారు. ఈమేరకు గడ్డర్లు (ఇనుప కమ్మిలు) భారీ క్రేన్‌తో ప్లాట్ ఫారాలపై అమర్చారు. మూడు, నాలుగు ప్లాట్ ఫారాలపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిబిరం నుంచి రైల్వే ఇంజనీరింగ్ అధికారులు భారీ క్రేన్ సాయంతో పెద్దపెద్ద గడ్డర్లను మధ్యాహ్నం ఫుట్ ఓవర్ బ్రిడ్జి కమ్మిలపై అమర్చారు. ఈ దృశ్యాలను ప్రయాణికులు తమ కెమెరాలో బంధించారు. మరో 20 రోజుల్లోగా పూర్తవుతాయని అధికారులు పేర్కొంటున్నారు.

బ్రిడ్జిపై స్టాల్స్..

నూతనంగా నిర్మిస్తున్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జిపై తినుబండారాలు తదితర స్టాల్స్ ఏర్పాటు చేయనున్నారు. అలాగే బ్రిడ్జికి 1,2,4 ప్లాట్‌ఫారాలపై ప్రయాణికులు ఎక్కేందుకు, దిగేందుకు రెండు చొప్పున ఎస్కలేటర్లు, మూడు ర్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు. ఫుట్‌ఓవర్ బ్రిడ్జికి మెట్లమార్గం ఉండదని రైల్వే అధికారులు పేర్కొన్నారు.

డెంగీ లక్షణాలతో విద్యార్థి మృతి

- బోడ మాణిక్యం తండాలో విషాదం



జీవన్ (ఫైల్)



ఆస్పత్రి వద్ద రోదిస్తున్న బాలుడి కుటుంబసభ్యులు

చెన్నారావుపేట/బాలసముద్రం, జూలై 29 : డెంగీ లక్షణాలతో విద్యార్థి మృతి చెందిన ఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం బోడమాణిక్యంతండాలో సోమవారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్థులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. తండాకు చెందిన భూక్య ఉమ-మోహన్‌ల కుమారుడు భూక్యా జీవన్(13) మండల కేంద్రంలో 8వ తరగతి చదువుతున్నాడు. వారం రోజుల క్రితం జీవన్‌కు తీవ్రంగా జ్వరం వచ్చింది. నర్సంపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పరీక్షలు చేయించారు. వైరల్ జ్వరంగా వైద్యులు నిర్ధారించి మందులు ఇచ్చి ఇంటికి పంపించారు. రెండు రోజుల క్రితం వాంతులు చేసుకున్నాడు. దీంతో హన్మకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు డెంగీగా గుర్తించి, ఆసుపత్రిలో చేర్చారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలిస్తుండగా సోమవారం మృతి చెందాడు. సిద్ధార్థ ప్రిన్సిపాల్ అండెం కర్ణాకర్‌రెడ్డి, నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు కేతిడి వీరారెడ్డి, జక్క అశోక్, మండల కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దెన రమేష్, కుండె కుమారస్వామి, నెక్కొండ బ్లాక్ కార్యదర్శి మంద యాకయ్యగౌడ్ మృతదేహానికి నివాళులర్పించారు.

వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబసభ్యుల ఆందోళన

కాగా, వైద్యుల నిర్లక్ష్యంతోనే తమ కుమారుడు జీవన్ మృతిచెందాడని బాలుడి కుటుంబసభ్యులు హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. వెంటనే సుబేదారి పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఆందోళన చేపడుతున్న వారితో పోలీసులు మాట్లాడుతుండగా బాలుడి కుటుంబ సభ్యులు పోలీసులతో, వైద్య సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. అయితే ఆసుపత్రి యాజమాన్యం బాలుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి ఆదుకుంటామని చెప్పడంతో గొడవ సద్దుమణిగింది.

ఆస్పత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

- వెంకట్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

డెంగీ జ్వరంతో హస్పిటల్‌లో చేరిన బాలుడు జీవన్ మృతికి ఆస్పత్రి యాజమాన్యానిదే పూర్తి బాధ్యత అని వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డిమాండ్ చేశారు. సోమవారం మృతి చెందిన బాలుడు జీవన్ కుటుంబసభ్యులను వెంకట్ పరామర్శించి మాట్లాడారు.




చెరబట్టి

- గూడేల్లో మళ్లీ గుడుంబా మంటలు
- గుట్టుగా గ్రామాలు, పట్టణాలకు తరలింపు
- మద్యం అధిక ధరలతో నిరుపేదల మొగ్గు
- గుడుంబారహిత జిల్లా లక్ష్యానికి తూట్లు

వర్ధన్నపేట రూరల్, జూలై 29: గుడుంబారహిత జిల్లాగా ఉన్న వరంగల్‌లో గుడుంబా మళ్లీ పడగ విప్పుతోంది. గుడుంబా బట్టి.. పేదల జీవితాలను చెరబడుతోంది. ప్రమాదకరమైన గుడుంబాకు బానిసలై తమ బతుకులను ఛిద్రం చేసుకుంటున్నారు. మద్యం ధరలు భారీగా పెరగడంతో కూలీలు, నిరుపేదలు నెమ్మదినెమ్మదిగా గుడుంబాకు అలవాటుపడుతున్నారు. వారి బలహీనతను ఆసరా చేసుకుని గుడుంబా తయారుదారులు జోరుపెంచారు. నల్లబెల్లం, పటిక లేకపోయినా చక్కెర, ఈస్ట్ పౌడర్‌తో గుడుంబా తయారు చేసి అమ్మకాలు జరుపుతున్నారు. జిల్లా వ్యాప్తంగా గుట్టు చప్పుడు రాత్రికి రాత్రి గ్రామాలకు తరలిస్తున్నారు. మద్యం దుకాణాలపైనే ఎక్సైజ్ అధికారులు పూర్తిగా దృష్టి పెట్టడంతో గుడుంబా తయారుదారులు చాపకింద నీరులా విస్తరిస్తున్నారు. పట్టణాలకు సైతం గుడుంబా తరలిస్తుండడం గమనార్హం. ఒక్కో లీటర్ గుడుంబా రూ.120 నుంచి రూ.150 వరకు విక్రయిస్తున్నారు. గుడుంబా కిక్కు కోసం బెల్లం పానకం నానబెట్టిన డ్రమ్ములో ఘాటైన లవం గాలు, వేప చెక్క పొట్టు, నిమ్మకాయ చెక్క పొట్టు కలుపుతారు. కొన్ని చోట్ల ప్రమాదకరమైన యూరియాను కలుపుతారని చెపుతుంటారు.

వర్ధన్నపేట పరిధిలో...

వర్ధన్నపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధి లో జోరుగా గుడుంబా తయారవు తున్నట్లు తెలుస్తోంది. ఇక్కడి నుంచే జిల్లాలోని వివిధ ప్రాంతాలకు తరలుతు న్నట్టు ప్రచారం సాగుతోంది. వర్ధన్నపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వర్ధన్నపేట, రాయపర్తి, పర్వతగిరి, సంగెం మండలాలు ఉన్నాయి. ఈ పరిధిలోని ఆయా మారుమూల గ్రామాలు, గూడాలు, తండాల్లో ఈ మధ్య కాలంలో జూలై నుంచి గుడుంబా స్థావరాలపై అధికారులు ముమ్మరంగా దాడులు చేస్తున్నారు. వర్ధన్నపేట, రాయపర్తి పరిధిలోని తండాల్లో కేసులు నమోదు చేశారు. పర్వతగిరి, సంగెం మండలాల్లోనూ కేసులు నమోదయ్యాయి. రాయపర్తి, పర్వతగిరి మండలాల్లో అత్యధిక గిరిజన తండాలు ఉండగా అక్కడి నుంచే ఎక్కువగా గుడుండా బట్టీలు పెట్టి గ్రామాలకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. వర్ధన్నపేట పరిధిలోని డీసీతండా, నీలగిరిస్వామితండాల్లో ఎక్కువగా తయారు చేసి, పక్క తండాలైన రామోజీ కుమ్మరిగూడెం తండాకు గుట్టుగా తరలిస్తున్నారని తెలుస్తోంది. చాలాచోట్ల గ్రామాల్లో బెల్టు షాపుల నిర్వాహకులే గుడుంబానూ అమ్ముతున్నట్లు సమాచారం.



మద్యం ధరల పెరుగుదల పేద, మధ్య తరగతి కుటుంబాలకు గుదిబండగా మారింది. గతంలో రూ.60 వరకే దొరికే క్వార్టర్ ఓసీ ఇప్పుడు రూ.150 కావడంతో పేదలు, కూలీలు గుడుంబాపై మొగ్గుచూపుతున్నారు. పేదలు గుడుంబాను మానేయాలనే ఆలోచనతో రూ.70 మద్రాసు (చీప్ లిక్కర్) మందును తీసుకువచ్చింది. క్రమంలో అది కూడా ప్రస్తుతం రూ. 110 వరకు ధర పలుకుతోంది. దీంతో రోజు చేసిన కష్టంతో వచ్చే డబ్బుల్లో 30శాతం వరకు మద్యానికే ఖర్చు పెట్టలేకపోతున్నారు. దీంతో మద్యా నికి బానిసైన కొందరు డబ్బులు లేకపోవడంతో తక్కువకే వచ్చే గుడుంబాను మళ్లీ తాగడం ప్రారంభిస్తున్నారు.

కారు అదుపుతప్పి యువకుడికి గాయాలు

ఎయిర్‌బ్యాగ్ తెరుచుకోవడంతో తప్పిన ప్రమాదం

గూడూరు, జూలై 29: మండలంలోని నాయకపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి ఓ కారు అతివేగంగా దూసుకువెళ్లి పొలాల్లోకి వెళ్లి బోల్తా పడింది. మండలంలోని దామరవంచకు చెందిన నలుగురు యువకులు ఆదివారం రాత్రి 10 గంటల ప్రాంతంలో గూడూరు నుంచి మహబూబాబాద్‌కు కారులో వెళ్తున్నారు. నాయకపల్లిలో అతివేగంగా నడుపుతూ రోడ్డుపై కుక్క ఉండడంతో ఎడమ వైపుకు వాహనం తిప్పాడు. ఎడమ వైపున ఉన్న ఓ వ్యక్తి సెల్ లైట్ వేసుకుని నడుచుకుంటూ వెళ్తుండడంతో గమనించిన డ్రైవర్ ఆవెంటనే మళ్లీ కుడివైపుకు తిప్పాడు. కుడివైపున ఉన్న చిన్నకంకర కుప్పపైకి వెళ్లడం, ఆవెంటనే ఎడమవైపుకు వేగంగా దూసుకెళ్తూ తొలుత కల్వర్టును ఢీకొట్టింది. ఆపై ఓ చెట్టును, హైటెన్షన్ విద్యుత్ స్తంభానికి ఏర్పాటు చేసిన స్టే వైరును కారు ఢీకొట్టి రోడ్డు కింది భాగంలోని పొలాల్లో పడింది. వాహనంలో ఉన్న ఎయిర్‌బ్యాగులు సకాలంలో తెరుచుకోవడంతో ముందుభాగంలో ఉన్న వారికి ప్రాణాపాయం తప్పింది. వాహనం నడుపుతున్న దామరవంచ తండాకు చెందిన నూనావత్ సిద్ధు తలకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 ద్వారా గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్సనందిస్తున్నారు. ప్రమాదం జరిగిన కొద్ది దూరంలో రోడ్డువెంట మాట్లాడుతున్న గ్రామస్తులు, చిన్నపిల్లలు, రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తి పక్క నుంచే కారు అతివేగంగా దూసుకుపోవడంతో వారు భయాందోళనకు గురయ్యారు.



ప్రమాదంలో గాయపడిన నూనావత్ సిద్ధు

సింగరేణి స్కూళ్లలో సీబీఎస్ఈ సిలబస్

బోర్డుకు దరఖాస్తు చేసిన సంస్థ

హైదరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పనిచేస్తున్న కార్మికుల పిల్లలకు, పరిసర ప్రాంత విద్యార్థులకు ఉన్నత ప్రమాణా లు గల మరింత నాణ్యమైన విద్యను అందించాలన్న ఉద్దేశంతో వ చ్చే విద్యాసంవత్సరం నుఏంచి సింగరేణి పాఠశాలలో సెంట్రల్ బో ర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ)సిలబస్‌ను బోధించాలని ఆ సంస్థ నిర్ణయించింది. దీనికోసం తొలుతగా రామగుండం-2 ఏరియా ఇంక్లైన్ కాలనీలో ఉన్న సెక్టార్-3 సింగరేణి పాఠశాలలో సీబీఎస్ఈ బోధనను చేపట్టనుంది. ఈ మేరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్‌కు సింగరేణి సంస్థ దరఖాస్తు సమర్పించింది. దీనికన్నా ముందు తెలంగాణ విద్యాశాఖనుం చి నిరభ్యంతర పత్రం(ఎన్‌వోసీ) తీసుకొని దరఖాస్తును సమర్పించింది. దాంతో పాఠశాలను పరిశీలించడానికి వీలుగా త్వరలోనే సీబీఎస్ఈకి చెందిన ఉన్నత స్థాయి బృందం రామగుండం చేరుకొని, తరగతి గదులను, పాఠశాల క్రీడా మైదానం , ప్రయోగ శాలలు, ఇతర మౌలిక వసతులు తదితర అన్ని అంశాలను పరిశీలించి, తగి న సిఫారసులు చేసే అవకాశాలున్నాయి. ప్రస్తుతానికి రామగుండం లో, ఆ తర్వాత శ్రీరాంపూర్ ఏరియాలోనూ దీన్ని అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు.

కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

వరంగల్ మెడికల్, జూలై 29 : కార్మిక వర్గ హక్కుల కోసం, కార్మిక చట్టాల సవరణకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఎంజీఎం ఆస్పత్రి కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు పిలుపునిచ్చారు. సోమవారం ఎంజీఎం ఆవరణలో సెక్యూరిటీ గార్డు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆధ్వర్యంలో తెలంగాణ అసంఘటిత కార్మికుల సమాఖ్య కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆగస్టు 4న వరంగల్‌లో కార్మిక వర్గ హక్కుల కోసం, కార్మిక చట్టాల సవరణకు వ్యతిరేకంగా రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతీ కార్మికుడికి కనీస వేత నం రూ. 26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, సెక్యూరిటీ గార్డు, శానిటేషన్, పేషంట్ కేర్ ఉద్యోగులను తక్షణ మే పర్మినెంట్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎం హాస్పిటల్ వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు, సి బ్బంది గొర్రె నాగరాజు, ఆర్.రాజు, సుధాకర్, పుష్ప, రాజవీరు, ఇంద్ర, విజయ్, కోమల, మంజుల, అశోక్, రాజేష్, రాజమణి, జ్యోతి, నాగరాజు, చందు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు పండుగల పంచాంగం అందజేత



సీఎంకు పండుగల జాబితాను అమ్మవారి ప్రసాదాన్ని అందించిన సభ్యులు

వరంగల్ కల్చరల్, జూలై 29: తెలంగాణ విద్వత్‌సభ ఆధ్వర్యంలో పంచాంగకర్తలు, సిద్ధాంతులు ధర్మశాస్త్రాలకు అనుగుణంగా పండుగల నిర్వహణను తెలియజేసే 2025-26 విశ్వవసు నామ సంవత్సర జాబితా(పంచాంగం)ను అసెంబ్లీలో ముఖ్యమంత్రి కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డికి సోమవారం అందించారు. అలాగే, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు జూబ్లీహిల్స్‌లోని స్వగృహంలో సభ బాధ్యులు సమర్పించారు. వారు మాట్లాడుతూ విద్వత్‌సభ వారికి ఏ అవసరం వచ్చినా తీర్చాలని దేవాదాయ శాఖకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశిలిచ్చినట్టు పేర్కొన్నారు. పండుగల నిర్వహణలో ఎలాంటి అనిశ్చితి లేకుండా జాబితాను నిర్ధారించి అందించినందుకు మంత్రి సురేఖ అభినందించారన్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హన్మంతరావు, భద్రకాళి దేవస్థానం ప్రధానార్చకులు భద్రకాళి శేషు(వరంగల్), యాదాద్రి దేవస్థానం చైర్మన్ నర్సింహమూర్తి, ప్రధానార్చకులు నర్సింహచార్యులు(యాదాద్రి), విద్వత్‌సభ కార్యదర్శి దివ్యజ్ఞాన సిద్ధాంతి(మేడపల్లి-నల్లగొండ), కోశాధికారి ఎంవీఆర్ శర్మ(హైదరాబాద్), వేదపండితులు నటార్‌శర్మ(వరంగల్), సాయిదీక్షిత్(వరంగల్) పాల్గొన్నారు.

పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలి



జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న కడారి భోగేశ్వర్

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 29 : ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లను వెంటనే నియమిం చాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొం డలోని సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టీపీటీఎఫ్ వరంగల్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భోగేశ్వర్ మాట్లాడుతూ.. పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా పాఠశాలల్లో పారిశుధ్య పనులను ప్రభుత్వం పట్టించు కోవడం లేదన్నారు. పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించి నాణ్యమైన విద్యను అందించాలన్నారు. ఇటీవల జరిగిన పదోన్నతుల్లో బీఈడీ కలిగి ఎస్జీటీలు నష్టపోయారని, వారికి పదోన్నతులు కల్పించాలన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా సీపీఎస్‌ను రద్దు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలన్నారు. చాలా పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణమ య్యా యని, వాటి నిర్వహణకు స్కావేంజర్లను నియమించాలన్నారు. ఉపాధ్యాయుల పెం డింగ్ బిల్లులను మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు జి. వెంకటేశ్వర్లు, పి. మనోజ్, స్వామి, తన్వీర్, బుచ్చాచారి, అశోక్, పూర్ణ చందర్, రమేష్, రవి, మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

పారా ఒలింపిక్స్‌కు టెక్నికల్ అఫిషియల్‌గా కేసముద్రం పీడీ



కొమ్ము రాజేందర్

కేసముద్రం, జూలై 29 : ప్యారిస్‌లో ఆగస్టు 25 నుంచి సెప్టెంబరు 5వ తేదీ వరకు జరిగే పారా ఒలింపిక్స్‌కు దేశం తరఫున బ్యాడ్మింటన్ క్రీడకు టెక్నికల్ అఫిషియల్‌గా కేసముద్రం జడ్పీ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ కొమ్ము రాజేందర్ ఎంపికైనట్లు ఉమ్మడి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.రమేష్‌కుమార్, కార్యదర్శి డాక్టర్ పి.రమేష్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ బ్యాడ్మింటన్ అంపైర్‌గా రాజేందర్ గతంలో రెండుసార్లు ప్రపంచ ఛాంపియన్‌షిప్ పోటీలకు, ఏషియన్ గేమ్స్, బ్యాడ్మింటన్ ఏషియా, ఏషియన్ స్కూల్ గేమ్స్, కామన్ వెల్త్ క్రీడలు, మూడుసార్లు ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్, టాటా ఓపెన్ ఇంటర్నేషనల్, ఇన్ఫోసిస్ ఇంటర్నేషనల్, ఆల్ ఇండియా పోలీస్ బ్యాడ్మింటన్, నేషనల్ గేమ్స్, సౌత్ జోన్ క్రీడలతో పాటు అనేక జాతీయ స్థాయి క్రీడలకు అంపైర్‌గా వ్యవహరించినట్లు చెప్పారు. తాజాగా వరల్డ్ బ్యాడ్మింటన్ ఫెడరేషన్ వారు టెక్నికల్ అఫిషియల్‌గా రాజేందర్‌ను ఎంపిక చేసినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కోశాధికారి నాగకిషన్, స్థానిక హైస్కూల్ హెచ్‌ఎం బి.రాజు, ఉపాధ్యాయ బృందం, పలువురు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఆర్‌పీఐ ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షురాలిగా విజయ



విజయ

వడ్డెపల్లి, జూలై 29 : రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ) బొజ్జా తారకం ఉమ్మడి వరంగల్ జిల్లా గౌరవ అధ్యక్షురాలిగా హనుమకొండ పట్టణానికి చెందిన చేపూరి విజయ నియమితులయ్యారు. ఆర్‌పీఐ బొజ్జా తారకం రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య ఆదేశం మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంకేశ్వరపు రమేష్ ఈ మేరకు సోమవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేద్కర్, ఆర్‌పీఐ వ్యవస్థాపకులు బొజ్జా తారకం ఆశయాల సాధన కోసం కృషి చేస్తానని చేపూరి విజయ పేర్కొన్నారు.

ఆదుకోవాలని కళాకారుల భిక్షాటన



భిక్షాటన చేస్తున్న కళాకారులు

హనుమకొండ కల్చరల్, జూలై 29 : ప్రత్యేక తెలం గాణ రాష్ట్రం కోసం జరిగిన పోరాటంలో అమరవీరుల అనంతరం గళమెత్తి ఉద్యమించిన కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ కళాకారులు నిరసనగా భిక్షాటన చేశారు. వరంగల్ చౌరస్తాలో ఒక బృందం, హనుమకొండ చౌరస్తాలో ఒక బృందం కళాకారులు భిక్షాటన చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో కళాకారులకు న్యాయం చేయాలంటూ కోరారు. రోడ్డుప క్కన ఉన్న షాపుల్లోకి వెళ్లి భిక్షాటన చేశారు. కళాకా రుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆదుకోవాలన్నారు. సకల కళా సాంస్కృతిక మండలి రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం సుధాకర్, ఎస్ కే.రాజు, బిర్రు సురేం దర్, గుండెకారి సునీల్, సదానందం, డప్పు కార్తీక్, వెంకట్, హను మకొండ జిల్లా అధ్యక్షుడు ఇ.చంద్రశేఖర్, పరమేశ్వరి, రాయబారపు సాంబయ్య తదితర సుమారు 100 మంది కళాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

లెఫ్ట్ ఓవర్ వేకెన్సీల్లో పదోన్నతులు

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 29 : ఉపాధ్యాయులకు ఇటీవల పదోన్నతులు నిర్వహించగా కొన్ని ఖాళీలు మిగిలాయి. వరంగల్ జిల్లాలో 43 ఖాళీలు ఏర్పడగా హనుమకొండ జిల్లాలో సైతం 43 ఖాళీలే ఏర్పడ్డాయి. దీంతో మిగులు ఖాళీల్లో సైతం అర్హులైన ఉపాధ్యాయులకు సోమవారం పదోన్నతులు కల్పించారు. వరంగల్ జిల్లాలో పీఎస్ హెచ్‌ఎంలు 4, హిందీలో 5, ఫిజికల్‌సైన్స్‌లో 1, సోషల్ స్టడీస్‌లో 9, స్పెషల్ ఎడ్యుకేషన్ 2, తెలుగులో 7, బయోసైన్స్‌లో 8, ఇంగ్లీష్‌లో ఐదుగురు ఉపాధ్యాయులు పదోన్నతులు పొందారు. అయితే వరంగల్‌లో 40 మంది ఉపాధ్యాయులకి మాత్రమే ప్రమోషన్ రాగా, మిగతా మూడు ఖాళీల్లో సంబంధిత సబ్జెక్టు ఉపాధ్యాయులు లేకపోవడంతో 3 ఖాళీలు అలాగే ఉన్నాయి. హనుమకొండ జిల్లాలో పీఎస్ హెచ్‌ఎంలలో 11, సోషల్ స్టడీస్‌లో 16, బయోసైన్స్‌లో 8, ఇంగ్లీష్‌లో 7, ఫిజికల్ సైన్స్‌లో ఒక్కరు పదోన్నతి పొందారు. వీరందరికి సోమవారం ఆర్డర్లు ఇవ్వగా మంగళవారం పాఠశాలల్లో జా యిన్ కానున్నారు.

సీపీ పేరిట నకిలీ ఫేస్ బుక్ అకౌంట్

ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపుతున్న సైబర్ నేరగాళ్లు

వరంగల్ క్రైం, జూలై 29 : సైబర్ నేరగాళ్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పేరిట నకిలీ ఫేస్ బుక్ క్రియేట్ చేశారు. నకిలీ ఫేస్ బుక్ క్రియేట్ చేసి పలువురు ఖాతాదారులకు ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపుతున్నారు. ఈ విషయమై అప్రమత్తమైన కమిషనర్ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. కమిషనర్ అంబర్ కిషోర్ పేరిట వస్తున్న ఫ్రెండ్ రిక్వెస్ట్‌కు ఎవరూ స్పందించకూడదని పేర్కొన్నారు. ఇది నకిలీ ఫేస్ బుక్ అని గుర్తించాలని వారు పేర్కొన్నారు.

శిల్పారామం ఏర్పాటెప్పుడు?



హైదరాబాద్‌లోని ఈ శిల్పారామం తరహాలోనే వరంగల్‌లోనూ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు..

- రూ.6కోట్లు ఇచ్చినా ముందుకు పడని అడుగు
- పట్టించుకోని గత బీఆర్ఎస్ సర్కార్
- స్థలం ఎంపికపైనే ఎడతెగని తకరారు
- ప్రస్తుత ప్రభుత్వమైనా చొరవ తీసుకోవాలంటున్న నగర వాసులు

పద్నాలుగేళ్ల క్రితం మంజూరు

హన్మకొండ, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ తరహాలో వరంగల్‌లో కూడా శిల్పారామం ఏర్పాటు చేస్తామని పద్నాలుగేళ్ల క్రితం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. అందుకు రూ.6కోట్లకు పైగా నిధులను కూడా మంజూరు చేసింది. కానీ ఆ పనులు నేటికీ మొదలవలేదు. అసలు శిల్పారామం ఏర్పాటుకు అవసరమైన స్థలం ఎంపికపైన ఏర్పడిన తకరారు ఇప్పటికీ సాగుతూనే ఉంది. ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్నా ఎంపికలో తీవ్ర జాప్యం జరుగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే మంజూరైన శిల్పారామం ప్రాజెక్టును ఆచరణలోకి తీసుకోవలసిన బాధ్యత ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్‌పైనే ఉందని వరంగల్ నగర వాసులు పేర్కొంటున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో సాకారం కాని తమ చిరకాల స్వప్నాన్ని నెరవేర్చాలని కోరుతున్నారు.

14 ఏళ్లనాటి కల..

నగర వాసుల శిల్పారామం కల ఇప్పటిది కాదు. పదమూడేళ్లనాటిది. నాటి ప్రభుత్వం నిధులిచ్చినా ఎక్కడ ఏర్పాటు చేయాలనే విషయంలో స్పష్టత లేకపోవడం ఈ ప్రాజెక్టుకు శాపంగా మారింది. అనువైన స్థలం గుర్తింపులో అధికారుల వైఫల్యం గ్రహపాటుగా మారింది. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో శిల్పారామం మంజూరైంది. హైదరాబాద్ తరహాలో వరంగల్‌లో ఏర్పాటుకు 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత శిల్పారామం ఏర్పాటులో కొంత కదలిక వచ్చినా ఆ తర్వాత కాలంలో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. సీఎం కేసీఆర్ వరంగల్ నగరాన్ని సందర్శించినప్పుడు వరంగల్‌తో త్వరలో శిల్పారామం ఏర్పాటుపై ఇచ్చిన హామీ, మంత్రులు, ప్రజాప్రతినిధులు ఆయా సందర్భాల్లో చేసిన ప్రకటనలు గాలిమాటలుగానే మిగిలి పోయాయి. స్థానికంగా ఉన్న హస్తకళాకారుల ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించేందుకు, పట్టణాల్లో నివసించే వారికి పల్లె వాతావరణం రుచి చూపేందుకు, వివిధ ప్రదర్శనల ద్వారా స్థానిక కళాకారులకు ఉపాధి కల్పించేందుకు. పర్యాటకులను విశేషంగా ఆకట్టుకునేందుకు రాష్ట్రంలోని అన్ని ముఖ్య నగరాల్లో శిల్పారామాలను ఏర్పాటు చేయాలని 2008లో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి నిర్ణయించారు. హైదరాబాద్ తరహాలోనే వరంగల్‌తో పాటు సంగారెడ్డి, కడప, విశాఖపట్టణం, తిరుపతి, అనంతపూర్‌లలో వీటిని ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు. అప్పటి నుంచి వరంగల్ ప్రజలు శిల్పారామం కోసం ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. అధికారులు కసరత్తు చేసినా ఇప్పటి వరకు కొలిక్కి రాలేదు.

మూలుగుతున్న నిధులు

వరంగల్‌లో ఏర్పాటు చేసే శిల్పారామంలో వివిధ చేతి వృత్తుల అమ్మకానికి 40కిపైగా స్టాళ్లు, నాటక, కళా ప్రదర్శనలకు ఎపెన్ ఏయిర్ థియేటర్, ఒక సమావేశ మందిరాన్ని ఏర్పాటు చేయాలని, శిల్పారామంలో చిన్నపాటి చెరువును ఏర్పాటు చేసి అందులో పిల్లల ఆహ్లాదానికి బోటింగ్ సౌకర్యం కల్పించాలని ప్రతిపాదించారు. అదనపు ఆకర్షణగా రాక్ గార్డెన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అప్పటి అంచనా ప్రకారం మొత్తం రూ.12కోట్ల వ్యయం కాగా దశల వారీగా నిధులు విడుదల చేస్తామని చెప్పిన నాటి ప్రభుత్వం తొలి విడతగా రూ.5కోట్లను, ఆ తర్వాత రూ.కోటి 14 లక్షలను మంజూరు చేసింది. మొత్తంగా రూ.6.14కోట్లు విడుదలైనా ఇప్పటికీ అవి ఖర్చు కాకుండా మూలుగుతున్నాయి. శిల్పారామం ఏర్పాటైతే స్థానికులకు ఉపాధి లభిస్తుంది. హస్తకళాకారులు తాము తయారు చేసిన కళారూపాలకు, ప్రధానంగా చేనేత కార్మికులు ఉత్పత్తి చేసిన వస్త్రాలకు మార్కెట్ లభిస్తుంది. పర్యాటకులు, నగరవాసులకు ఆహ్లాదం కూడా అందుతుంది.

స్థల ఎంపికలో తకరారు..

శిల్పారామం ఏర్పాటుకు స్థలం ఎంపికే పెద్ద సమస్యగా మారింది. ఎక్కడ ఏర్పాటు చేయాలనే విషయంలో అధికారులు తుది నిర్ణయానికి రాలేక పోతున్నారు. ఇప్పటి వరకు అయిదారు చోట్ల స్థలాలను చూశారు. వీటిలో కొన్నిటిని ఖరారు చేశారు. చివరి నిమిషంలో నిర్ణయాన్ని మార్చుకున్నారు. శిల్పారామంను మొదట హన్మకొండ గోపాలపురంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించి ఓ బోర్డు కూడా ఏర్పాటు చేశారు. సుమారు 20 ఎకరాల స్థలం ఈ స్థల సేకరణకు అధికారులు కొంత కసరత్తు చేశారు. అయితే ఈ స్థలంలో అప్పటికే పలు అక్రమ నిర్మాణాలు జరిగినందు వల్ల శిల్పారామం ఏర్పాటు సాధ్యం కాదని భావించిన అధికారులు ప్రతిపాదనను ఉపసంహరించుకున్నారు. ఖిలా వరంగల్ కోట సమీపంలోనూ స్థలాన్ని చూసిన అధికారులు పర్యాటక ప్రాంతమైన ఓరుగల్లు కోటకు దగ్గరగా ఉందని, ఈ స్థలం అనుకూలమైందని భావించి ఏర్పాటుకు రంగం సిద్ధం చేశారు. కానీ కేంద్ర పురావస్తు శాఖ అభ్యంతరం చెప్పడంతో అక్కడ కూడా కార్యరూపం దాల్చలేదు. హన్మకొండ బాలసముద్రంలో హయగ్రీవాచారి గ్రౌండ్‌కు ఎదురుగా ఉన్న అయిదు ఎకరాల స్థలాన్ని కూడా చూశారు. అయితే ఈ స్థలం సరిపోదని, పైగా ఇది ఇళ్ల మధ్యలో ఉందని అధికారులు ఆ ఆలోచనను కూడా మానుకున్నారు. నగర శివార్లలోని హసన్‌పర్తిలో ఏర్పాటు చేసే విషయమై కూడా అధికారులు పరిశీలించారు. మామూనూరు సమీపంలో బెస్తం చెరువును అనుకొని జయశంకర్ స్మృతి వనం కోసం ప్రతిపాదించిన స్థలాన్ని కూడా పరిశీలించారు. నగరానికి 8కిలోమీటర్ల దూరంలో వరంగల్-ఖమ్మం రోడ్డును అనుకొని ఉన్న ఈ స్థలం శిల్పారామానికి అనువైనదిగా భావించారు. అప్పుడు కూడా యాదాద్రి టెంపుల్ డెవలప్‌మెంట్ కమిటీ (వైటీడీసీ) వైస్‌చైర్మెన్ కిషన్‌రావు, ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్ సాయి ఈ స్థలాన్ని పరిశీలించారు. మొత్తం 60 ఎకరాల్లో శిల్పారామానికి 15 ఎకరాలు కేటాయించేందుకు నాటి కలెక్టర్ వాకాటి కరుణ అంగీకరించారు. కానీ అక్కడ కూడా ఏర్పాటు కాలేదు. చివరికి 2019 సెప్టెంబరు 19న నాటి ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, హైదరాబాద్ శిల్పారామం జనరల్ మేనేజర్ కిషన్‌దాస్ వరంగల్ హంటర్ రోడ్డులో జూపార్క్‌కు ఎదురుగా, ప్రాంతీయ సైన్స్ కేంద్రం సమీపంలో అందుబాటులో ఉన్న సుమారు 30ఎకరాలను పరిశీలించారు. ఇక్కడ శిల్పారామం ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనను పంపించారు. కానీ రెండేళ్లవుతున్నా ఓ కొలిక్కి రాలేదు. ఇక్కడ ఇప్పటికే అక్రమణలు, నిర్మాణాలున్నాయి. పైగా పూర్తిగా గుట్ట ప్రాంతం. ఇక్కడికి చేరుకోవడానికి దారి లేదు. ప్రస్తుతం ఉన్న ప్రాంతీయ సైన్స్ సెంటర్ నుంచే వెళ్లాల్సి ఉంటుందన్న ఆక్షేపణలున్నాయి. కానీ నాడు ఎమ్మెల్యే, కలెక్టర్, వైటీసీ వైస్ చైర్మెన్, మాజీ ఐఏఎస్ అధికారి, ఆర్ట్ డైరెక్టర్ తదితరులు సమీక్షించడంతో పెండింగ్‌లో ఉన్న శిల్పారామానికి కూడా మోక్షం లభించనట్టేనని నగరవాసులు భావించారు. కానీ ఆ తర్వాత అంతా మొదటికే వచ్చింది. అయితే అయితే అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడడానికి కొద్ది రోజుల ముందు ఓటర్లను ఆకట్టుకునేందుకు నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం కొంత హడావిడి చేసిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా శిల్పారామాన్ని ఏర్పాటు చేయాలని నగరవాసులు కోరుతున్నారు.

అక్టోబరులో జూపార్కుకు పెద్దపులి

వర్షాల కారణంగా టైగర్ జోన్ ఏర్పాటుకు ఆటంకం



వర్షం నీళ్లు చేరడంతో నిలిచిన టైగర్‌జోన్ పనులు

హనుమకొండ కలెక్టరేట్, జూలై 29 : వచ్చే అక్టోబరులో హనుమకొండ హంటర్‌రోడ్‌లోని జూపార్కుకు పెద్దపులి రానుంది. మూడు నెలల క్రితం జూపార్కులో అధికారులు టైగర్ జోన్ ఏర్పాట్లు ప్రారంభించారు. వాస్తవానికి టైగర్ జోన్ పనులు ఇప్పటికే పూర్తిచేసి జూపార్కుకు పెద్దపులిని తీసుకురావాల్సి ఉంది. అయితే ఈ సంవత్సరం వర్షాలు ఎక్కువగా కురుస్తుండడంతో టైగర్ జోన్ చుట్టు కంచె ఏర్పాటు చేసేందుకు గుంతలు తీయగా ఆ గుంతల్లో వర్షంనీరు చేరి పనులకు ఆటంకం కలిగింది. మూడు నెలల్లో టైగర్‌జోన్ పనులు పూర్తిచేసి పెద్దపులిని తీసుకువస్తామని జిల్లా అటవీ శాఖ అధికారులు తెలిపినప్పటికీ వర్షాల కారణంగా పనులు ఇప్ప టికే 70శాతం వరకు మాత్రమే పూర్తయ్యాయి. వ చ్చే సెప్టెంబర్ నెల చివరి వరకు టైగర్ జోన్ పనులు పూర్తిచేసి జూపార్కుకు పులిని తీసుకు వచ్చేందుకు అటవీ శాఖ అధికారులు పనులు వేగవం తం చేశారు. ఎంతోకాలంగా నగరంలో పులిని చూద్దాం అనుకునే ప్రజలకు మరో రెండు నెలల్లో పులి జూపా ర్కులో కనిపించనుంది.

వర్షాల కారణంగా టైగర్‌జోన్ పనులు ఆలస్యం



మయూరి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్

మూడు నెలల్లో జూపార్కులో టైగర్‌జోన్ పనులు పూర్తి చేసి పులిని తీసుకొద్దామనుకున్నాం. వర్షాలు పడటం వలన టైగర్‌జోన్ పనులు చేసే ప్రాంతంలో నీళ్లు నిలిచి పనులు చేయడానికి కొంతవరకు ఇబ్బంది ఎదురవుతోంది. ప్రస్తుతం ఇంకా ఇక్కడికి పులిని తీసుకువచ్చే కండిషన్ లేదు. పులిని కొత్త ప్రదేశానికి తీసుకొచ్చేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు 70శాతం వరకు టైగర్‌జోన్ పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం బారికేడ్స్ పనులు జరుగుతున్నాయి. లోపల ఇంకా టైల్స్ వేయాలి. ఎలక్ట్రిసిటీ కనెక్షన్ ఇవ్వాల్సి ఉంది. ప్లంబింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. సెప్టెంబర్ నెల చివరి వరకు పనులు పూర్తి చేసి అక్టోబర్‌లో జూపార్కుకు పెద్దపులిని తీసుకువస్తాం.

వెహికల్ ట్రాన్స్‌ఫోర్టు పేరుతో చోరీలు

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు .. రెండుకార్లు స్వాధీనం

మట్టెవాడ, జూలై 29 : వాహనాల ట్రాన్స్‌ఫోర్ట్ పేరుతో దొంగతనాలకు పాల్పడున్న అంతర్ రాష్ట్ర దొంగను మట్టెవాడ పోలీసులు సోమవారం అరెస్టు చేసినట్లు వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ తెలిపారు. సోమవారం దొంగల ముఠా అరెస్టు వివరాలను ఏసీపీ వెల్లడించారు. రెండు సంవత్సరాల నుంచి ఉత్తరప్రదేశ్‌కు ఆగ్రాకు చెందిన కృష్ణ కాంత్ సక్సేనా, రాజస్థాన్ రాఊంపాళీ ప్రాంతానికి చెందిన అనిల్ సోమకి, వికాస్‌లు వివిధ ప్రాంతాలకు చెందిన ట్రాన్స్‌ఫోర్టు, పార్సల్ సర్వీస్ వారి దగ్గరకు కస్టమర్ వెహికల్ ట్రాన్స్‌ఫోర్టు చేసేందుకు వారి వద్ద డ్రైవర్‌గా పని చేస్తూ దూర ప్రాంతాలకు కారును ట్రాన్స్‌ఫోర్టు చేయుటకు వారికి వాహనం ఇచ్చినప్పుడు ముగ్గురు కలిసి వాహనం నెంబరు ప్లేట్‌ని మార్చి, వరంగల్, హైదరాబాద్, బెంగుళూరు ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడ్డారన్నారు. జూన్ 22న మహారాష్ట్ర గోండియా జిల్లాకు చెందిన వికాస్‌కు చెందిన ఎకోస్పోర్ట్ కారును జైపూర్‌లోని రిలీఫ్ రీ లోకేషన్ పార్సెల్ సర్వీసు వారి వద్ద నుంచి మహారాష్ట్ర గోండియాలో డెలివరి కోసం తీసుకొని, ఆ వాహనంలో గతంలో దొంగతనాలకు పాల్పడిన విధంగా జూన్ 24న వరంగల్‌కు వచ్చి హంటర్‌రోడ్‌లోని ఓస్వాల్ ఎలక్ట్రికల్ షాపు నుంచి సుమారు రూ. 2 లక్షల విలువైన ఫినోలెక్స్ ఎలక్ట్రికల్ వైరును దొంగిలించారు. షాపు యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీసీ కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానంతో సోమవారం ఆగ్రాకు చెందిన కృష్ణకాంత్ సక్సేనను అరెస్టు చేసి అతని వద్ద నుంచి ఎకోస్పోర్ట్, మారుతి రిడ్జ్ కార్లను స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఏసీపీ తెలిపారు. కేసును ఛేదించడంలో ప్రతిభ కనబర్చిన ఎస్ఐ నవీన్ కుమార్, మట్టెవాడ క్రైమ్ పార్టీ పోలీసు సిబ్బంది అలీ, విజయ్, రాజు, తిరుపతి, నాగేశ్వర్‌రావు, ఐటీ కోర్ టీం సల్మాన్‌లను వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి అభినందించారు.



అరెస్టు చూపుతున్న వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్

మహాలక్ష్మీ పథకంతో పెరిగిన ఆదాయం

ఆర్టీసీ ఆర్ఎం విజయభాను



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎం విజయభాను

బాలసముద్రం, జూలై 29 : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మీ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆర్టీసీకి ఆదాయం పెరిగిందని వరంగల్ రీజనల్ ఆర్టీసీ ఆర్ఎం విజయభాను అన్నారు. సోమవారం హనుమకొండలోని ఆర్ఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆర్ఎం విజయభాను మాట్లాడుతూ వరంగల్ రీజనల్ పరిధిలో మొత్తం 928 బస్సులు ఉన్నట్లు తెలిపారు. మహాలక్ష్మీ పథకం కోసం 759 బస్సులు కేటాయించినట్లు ఆయన తెలిపారు. ఈ బస్సులలో 9 కోట్ల 46 లక్షల మంది ప్రయాణీకులు ప్రయాణించగా 5 కోట్ల 78 లక్షల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేసి మహాలక్ష్మీ స్కీంను వినయోగించుకున్నట్లు ఆయన తెలిపారు. పెరిగిన ప్రయాణికులకు గాను ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రూట్లలో బస్సుల సంఖ్యను సమయాలను క్రమబద్ధీకరించినట్లు ఆయన తెలిపారు. నూతనంగా 20 రూట్లలో ప్రజలు ప్రజాపతినిధుల విజ్ఞప్తుల మేరకు బస్సు సర్వీసులు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. మహాలక్ష్మీ పథకంతో ప్రయాణికులు ప్రయాణం పెరిగిందని హైదరాబాద్, కరీంనగర్, మరి కొన్ని రూట్లలో బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు త్వరలో 42 బస్సులు రానున్నట్లు ఆర్ఎం తెలిపారు. మహాలక్ష్మీ పథకం ప్రారంభించినప్పటి నుంచి వరంగల్ రీజియన్‌కు రూ.554 కోట్ల 63లక్షల ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

మహాలక్ష్మీ ప్రయాణీకుల ద్వారా రూ.293 కోట్ల 58లక్షల ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు. హనుమకొండ నూతన బస్టాండ్ నిర్మాణం కోసం ప్రణాళికలు చేస్తున్నట్లు ప్రస్తుతం వరంగల్ బస్టాండు నిర్మాణ పనులు జరుగుతున్నట్లు ఆయన తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ మహాలక్ష్మీ పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రతీ గ్రామానికి త్వరలో ఆర్టీసీ బస్సుల ఏర్పాటుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంలు భానుకిరణ్, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

రీ వాల్యుయేషన్ ఫలితాల కోసం ఎదురుచూపు

కేయూ డిగ్రీ సెమిస్టర్ విద్యార్థుల హైరానా

నిర్ణీత గడువు ముగిసినా ఫలితాల ఊసేలేదు



ఆన్‌లైన్‌లో రీవాల్యుయేషన్ కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకున్న రశీదు

కేయూ క్యాంపస్, జూలై 29 : కాకతీయ యూనివర్సిటీలో డిగ్రీ రీవాల్యూవేషన్ ఫలితాల కోసం విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. గత డిసెంబరులో వర్సిటీ డిగ్రీ కోర్సుల 1, 3, 5 సెమిస్టర్ విద్యార్థుల పరీక్షలు నిర్వహించారు. ఏప్రిల్‌లో పరీక్షల ఫలితా లను విడుదల చేశారు. అయితే చాలా మంది విద్యా ర్థులు తమ పరీక్షల ఫలితాలను రీవాల్యూవేషన్ చేయాలని దరఖాస్తులు వర్సిటీ అధికారులకు చేసుకున్నారు. ఒక్కో సబ్జెక్టుకు రూ. 305 చెల్లిం చారు. వర్సిటీకి బీఏ, బీకాం, బీఎస్సీ తదితర కోర్సుల్లో వేలల్లో దరఖాస్తులు వచ్చాయి. సాధారణంగా నెల రోజుల్లో దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులందరికీ తమ సబ్జెక్టులలో రీవాల్యూవేషన్, రీ కౌంటింగ్ చేసి ఫలితాలను విడుదల చేస్తారు. విద్యార్థులు తాము దరఖాస్తులు చేసుకున్నటువంటి సబ్జెక్టు మంచిగా రాసినట్లయితే రీవాల్యూవేషన్, రీకౌంటింగ్‌లో బేని ఫిట్ పొందుతారు. లేక నాట్ బేనిఫిట్ అని ఫలి తాలు వస్తాయి.

రీవాల్యూవేషన్‌కు దరఖాస్తులు చేసుకుని నెలలు గడిచినా వర్సిటీ అధికారులకు ఫలితాలను వెల్లడించాలనే ఊసే రావడం లేదు. దరఖాస్తులు చేసుకున్నప్పటి నుంచి నెల 15 రోజుల్లో ఫలితాలను వెలువరించాలనే నిబంధనలున్నప్పటికీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఫలి తాల కోసం విద్యార్థులు కాలం గడుస్తుండటంతో కళ్ళు కాయలు కాసేలా చూస్తున్నారు.

6వ సెమిస్టర్‌ది ఇచ్చారు.. మిగతావి మరిచారు...

ఉన్నత విద్య ప్రవేశాలకు వేళ్ళే విద్యార్థుల వెసులుబాటును ఆలోచించిన వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారులు డిగ్రీ 6వ సెమిస్టర్ రీవాల్యూ వేషన్ ఫలితాలను ఇచ్చారు. మిగతా 1, 2,3, 4, 5వ సెమిస్టర్ డిగ్రీ కోర్సులు ఫలితాలను మరిచారు. అయితే 1 నుంచి 5వ సెమిస్టర్‌లో ఏదైనా ఒక్క సబ్జె క్టు తప్పిన విద్యార్థి ఉన్నట్లయితే ఉన్నత విద్య ప్రవే శాలకు అర్హత కోల్పోతారు. దీన్ని గుర్తించని వర్సిటీ అధికారులు విద్యార్థులకు లాభం చేశామనే ఉద్దేశ్యం తో కేవలం 6వ సెమిస్టర్ రీవాల్యూవేషన్ ఫలితా లను వెల్లడించి చేతులు దూలుపుకోవడంపై విద్యా ర్థుల నుంచి విమర్శలు వెల్లువెత్తున్నాయి.

వారం రోజుల్లో ఫలితాలను వెల్లడిస్తాం..

ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, కేయూ పరీక్షల నియంత్రణాధికారి

వారం రోజుల్లో డిగ్రీ సెమిస్టర్ రీవాల్యూవేషన్ ఫలితాలను విడుదల చేస్తాం. రీవాల్యూవేషన్ ప్రాసెస్ పూర్తి చేసి ఫలితాలను విడుదల చేసే ఏర్పాట్లు చేస్తున్నాం. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులకు గురికావద్దు. వీలైనంత త్వరగా ఫలితాలను విడుదల చేస్తాం.



చేనేత కార్మికుడి మృతి.. పలువురి నివాళి


వన్నాల శ్రీనివాస్ (ఫైల్)

ఆటోనగర్, జూలై 29: కొత్తవాడకు చెందిన చేనేత కార్మికుడు వన్నాల శ్రీనివాస్(43) సోమవారం గుండెపోటుతో మృతిచెందాడు. పదేళ్లుగా మగ్గం నేస్తూ జీవిస్తున్న శ్రీనివాస్‌కు భార్య సునీత, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. మృతదేహానికి టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, చేనేత కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు చిప్ప వెంకటేశ్వర్లు, చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు రాఘవరావులు నివాళులర్పించారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు రాయిని శ్రీనివాస్, ఎలిగేటి శ్రీనివాస్, వీరబత్తిని రమేష్, ఐత సమ్మయ్య, ఆడెపు రవి, ఎస్‌డి.బాషా, ఎస్‌డి కరీం, ఇమామ్, అబ్బాస్, దువ్వ రమేష్, రాజు, ఆడెపు రమేష్ పాల్గొన్నారు.

ఆలయాలు ఆహ్లాదానికి నిలయాలు


అభయాంజనేయ ఆలయంలో మొక్కలు నాటుతున్న కాలనీవాసులు

శంభునిపేట, జూలై 29: ఆలయాలు పచ్చదనం, పరిశుభ్రతతో ఆహ్లాదానికి నిలయాలుగా ఉండేలా చూసుకోవాలని రంగశాయిపేట కాలనీస్ డెవలప్మెంట్ అసోసియేషన్ (ఆర్‌సీడీఏ) అధ్యక్షుడు కర్ని రవీందర్ అన్నారు. రంగశాయిపేట గణేష్‌నగర్ కాలనీలోని అభయాంజనేయస్వామి ఆలయంలో సోమవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంజనేయస్వామికి ఇష్టమైన రావి, వేప, బిల్వపత్రి, పూల మొక్కలను నాటామన్నారు. కార్యక్రమంలో అర్చకులు వేణునాథచార్యులు, గణేష్ నగర్ కాలనీ అధ్యక్షుడు విజయ్ సింగ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు నెల్లూరి శ్రీనివాస్, రాధాకిషన్, సారంగం, సుతారి రాజు, కొమురవెల్లి లక్ష్మీనారాయణ, ప్రభాకర్, వెంకట్ పాల్గొన్నారు.

దేశాయిపేట బ్రిడ్జిపై మరమ్మతులు


బ్రిడ్జిపై మరమ్మతులు చేస్తున్న నాయకులు

పోచమ్మమైదాన్, జూలై 29: దేశాయిపేట బ్రిడ్జి (కల్వర్టు)పై గుంతలు, సలాకులు తేలి ప్రమాదకరంగా మారడంతో కాంగ్రెస్ నాయకుడు సొంత ఖర్చులతో సోమవారం మరమ్మతులు చేయించాడు. వరంగల్ దేశాయిపేట- పైడిపెల్లి ప్రధాన రహదారిలో ఉన్న బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది. ఇటీవల కురిసిన వర్షాలతో బ్రిడ్జిపై గుంతలలో వర్షపు నీరు నిలిచి ప్రమాదాలు జరిగాయి. దీంతో పైడిపెల్లికి చెందిన కాంగ్రెస్ నాయకుడు జన్ను అరుణాకర్ సోమవారం సొంత ఖర్చులతో మరమ్మతులు చేయించాడు. అరుణాకర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి కుంటుపడి దేశాయిపేట బ్రిడ్జి ప్రమాదకరంగా మారిందని, ప్రభుత్వం స్పందించి వెంటనే బ్రిడ్జిని పునఃనిర్మించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జన్ను అభిషేకం, సుధీర్, అనిల్, జన్ను అజయ్, సుధాకర్, శ్రీను, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తను పరామర్శించిన ప్రదీప్‌రావు


రమేష్‌ను పరామర్శిస్తున్న బీజేపీ నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

పోచమ్మమైదాన్, జూలై 29: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న దేశాయిపేటకు చెందిన బీజేపీ కార్యకర్త కురే రమేష్‌ను సోమవారం బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు పరామర్శించారు. దేశాయిపేటలోని ఆయన నివాసంలో పరామర్శించి, ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జూలూరి నైనేష్, రాజు, సందీప్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ గాలికి..

• చలాన్లు, డ్రంకెన్ డ్రైవ్‌పైనే నజర్ • ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై అలసత్వం


పోచమ్మమైదాన్‌లో అస్తవ్యస్తంగా ట్రాఫిక్

మట్టెవాడ, జూలై 29: వాహనాలు నిబంధనల మేరకు సాఫీగా వెళ్లేలా చేయడం ట్రాఫిక్ పోలీసుల విధి. ఇదే వారి పనితీరుకు కొలమానంగా ఉండేది. ఇప్పుడా పరిస్థితి లేకుండా పోయింది. కేవలం పెండింగ్ చలాన్లు, డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదుపైనే దృష్టి సారిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎన్ని డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన కేసులు చేశారు, ఎంత మేరకు ఖజానాకు రాబడి తెచ్చారు అన్నదే కొలమానంగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎంతసేపూ కెమెరాలు చేత బట్టి ట్రాఫిక్ ఉల్లంఘించిన వాహనాల ఫొటోలు తీయడంలోనే ట్రాఫిక్ పోలీసులు నిమగ్నమవుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ట్రాఫిక్ సమస్యలను గాలికొదిలి, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కనీసం పట్టించుకోవడం లేదని వాహనదారులు మండిపడుతున్నారు. వరంగల్ నగరంలో ట్రాఫిక్ సమస్య ఉన్న జంక్షన్లలో ట్రాఫిక్ పోలీసులు కనిపించకపోవడం, ఉన్న సిబ్బంది ఫొటోలు తీయడం, చలాన్లు, డ్రంకెన్ డ్రైవ్ కేసుల నమోదుపైనే దృష్టిసారిస్తున్నారని ప్రజలు ఆగ్రహిస్తున్నారు. కనీసం కళ్ల ముందే ట్రాఫిక్ స్తంభించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. కొందరు వాహనదారులు రాంగ్ రూట్, అతివేగంగా వెళ్తూ ట్రాఫిక్ చిక్కులు సృష్టిస్తున్నా తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని వాహనదారులు పేర్కొంటున్నారు. అలాంటి సమయంలో కేవలం సిబ్బంది ఫొటోలు తీయడానికి మాత్రమే చొరవ చూపుతున్నారు. జంక్షన్లలో ట్రాఫిక్ పోలీసులు లేకపోవడంతో ప్రధాన జంక్షన్లలోరెడ్‌లైట్ పడినా చాలా మంది వాహనదారులు ముందుకు దూసుకుపోతున్నారు. దీంతో జంక్షన్లలో ప్రమాదాలు జరుగుతున్నాయి. నగరంలో పలు రహదారులు నిత్యం వాహనాలతో కిటకిటలాడుతున్నాయి. వరంగల్ స్టేషన్ రోడ్, ఆర్ఎన్‌టీ రోడ్, బట్టలబజార్ రోడ్, పిన్నవారి వీధి, విశ్వకర్మ వీధి, దుర్గేశ్వరాలయవీధి, పంజాబ్ నేషనల్ బ్యాంక్ వీధి, రామన్నపేట, బీట్‌బజార్, బందేలిశెట్టి వీధి, సీకేఎం ఆస్పత్రి రోడ్, జేపీఎన్‌రోడ్, ఎస్‌వీఎన్‌రోడ్, కాశిబుగ్గ ప్రధాన రహదారి, నర్సంపేట రోడ్, కొత్తవాడ, ఎంజీ రోడ్డు, మరికొన్ని ప్రాంతాల్లో రోడ్లు ఇరుకుగా ఉండడం, వాణిజ్య సముదాయాలకు పార్కింగ్ స్థలం లేకపోవడంతో రోడ్లపైనే వాహనాలను పార్కింగ్ చేస్తున్నారని వాహనదారులు పేర్కొంటున్నారు. దీంతో తరచూ ట్రాఫిక్ జాం అవుతోందని వాపోతున్నారు. నర్సంపేట రోడ్, తెలంగాణ జంక్షన్, కాశిబుగ్గ జంక్షన్, పోచమ్మమైదాన్ జంక్షన్, హెడ్ పోస్టాఫీస్ జంక్షన్లలో చాలా చోట్ల వాహనాలు తరుచూ నిలిచిపోతున్నాయి. దీంతో ఈ ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. కొన్ని రహదారుల్లో చిరు వ్యాపారులు రహదారులకు ఇరువైపులా వ్యాపారం చేస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారు. కొన్ని వాణిజ్య సముదాయాలలో సెల్లార్ ఉన్నా వాటిలో పార్కింగ్‌కు అనుమతించక పోవడంతో రోడ్లపైనే వాహనదారులు పార్కింగ్ వాహనాలను నిలుపుతున్నారు. ముఖ్యంగా ఎంజీరోడ్, పోచమ్మమైదాన్, జేపీఎన్‌రోడ్‌లలో కొన్ని వాణిజ్య సముదాయాలకు సెల్లార్లు ఉన్నప్పటికీ వాహనాలు మాత్రం రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. అలాగే వైన్స్‌షాపుల ముందు, బార్‌ల ముందు వాహనాలు రోడ్లపైనే పార్కింగ్ చేయడంతో తీవ్ర ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. కాశిబుగ్గ, నర్సంపేట్ రోడ్, తిలక్‌రోడ్, ఏనుమాముల మార్కెట్ రోడ్, తెలంగాణ జంక్షన్, దేశాయిపేటరోడ్, ఎంజీరోడ్, ఫోర్ట్ రోడ్, శివనగర్ తదితర ప్రాంతాల్లో రోడ్లపైనే వాహనాలు నిలుపడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.


నర్సంపేట రోడ్డు డీమార్టు నుంచి కాశిబుగ్గ వైపు రాంగ్‌రూట్‌లో వస్తున్న వాహనాలు

పార్కింగ్ చూపరు, చలాన్లు ఆపరు..

నిబంధనల ప్రకారం వాణిజ్య సముదాయాలు లేదా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేసినవారు తప్పనిసరిగా సెల్లార్‌లో పార్కింగ్ సదుపాయం కల్పించారు. కొన్ని వాణిజ్య సముదాయాలు సెల్లార్‌లో ఇతర నిర్మాణాలు చేపట్టడం, కొన్ని వాణిజ్య సముదాయాలు పా ర్కింగ్‌కు అనుమతించం లేదు. దీంతో రోడ్లపైనే వాహనాలు నిలపాల్సిన దుస్థితి నెలకొంది. అదే సమయం లో ట్రాఫిక్ పోలీసులు ఫొటోలు తీసి ఈ-చాలానాతో బాదుతున్నారని వాహనదారులు లబోదిబోమంటున్నారు. జీడబ్ల్యూఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు పార్కింగ్ సౌకర్యాన్ని చూపకుండా వాహనాలకు చాలాన్లు వేయడంపై మండిపడుతున్నారు.

రాంగ్ రూట్‌లలో ప్రయాణం...

నగరంలో పలుచోట్ల వాహనదారులు రాంగ్ రూట్‌లో వస్తూ వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. హంటర్‌రోడ్డు చిన్న బ్రిడ్జి నుంచి బీటూబజార్ వైపు షాట్‌కట్ కోసం రాంగ్ రూట్‌లో వస్తున్నారు. ఎల్‌బీనగర్ అబ్బాస్ ఫంక్షన్ హాల్ నుంచి పోచమ్మమైదాన్ వరకు రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తున్నారు. నిజాంపుర నుంచి డీమార్టు వరకు రాంగ్ రూట్‌లో వెళ్లే వాహనాలు ఎక్కువయ్యాయి. చార్‌బౌళి రోడ్డులోనూ రాంగ్‌రూట్‌లో వెళ్తున్నారు. వరంగల్ కాశిబుగ్గ, తిలక్ రోడ్ నుంచి వచ్చే వాహనాలు పోచమ్మమైదాన్ వైపు వెళ్లేందుకు ట్రాఫిక్‌రూల్స్ పాటించడం లేదు. నర్సంపేట్ రోడ్‌లోని డీమార్ట్ నుంచి చార్‌బౌళి వైపు వెళ్లేవారు రాంగ్ రూట్‌లో వెళ్తున్నారు. చార్‌బౌళి నుంచి కాశిబుగ్గకు వచ్చే వాహనదారులూ ఇదే చేస్తున్నారు.

చీకటి పడితే కానరాని సిబ్బంది..

నగరంలో చీకటిపడితే చాలు ట్రాఫిక్ సిబ్బంది కానరావడం లేదు. ఉన్న కొంతమంది సెల్‌ఫోన్లలో మాట్లాడడం లేదా జంక్షన్లలో పక్కకు నిలబడడం తప్ప ట్రాఫిక్ నియంత్రణను పట్టించుకోవడం లేదు. ట్రాఫిక్ పోలీసులతోపాటు లా అండ్ ఆర్డర్ పోలీసులు, ఇతర పోలీసులు కెమెరాలతో హెల్మెట్ లేని వాహనదారులకు ఫొటోలు తీయడంలో నిమగ్నమవుతున్నారు. దీంతో వాహనదారులకు ఒకేరోజు రెండు, మూడు చలాన్లు పడుతున్నాయని వాపోతున్నారు. ఒక ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రోజుకు 1,500లకుపైగా ట్రాఫిక్ ఉల్లంఘనకు సంబంధించిన ఫొటోలు తీయడంలో నిమగ్నమవుతున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే కెమెరాలతో ఫొటోలు తీస్తున్నామని సిబ్బంది పేర్కొంటున్నారు.

గంగదేవిపల్లిలో కేంద్ర సచివాలయ బృందం


గంగదేవిపల్లిలో కేంద్ర సచివాలయ బృందం

గీసుగొండ, జూలై 29: మండలంలోని జాతీయ ఆదర్శ గ్రామాలైన గంగదేవిపల్లి, మరియపురం గ్రామాలను కేంద్ర సచివాలయ గ్రూప్ 1 బృందం ఫౌండేషన్ ట్రేయినింగ్ ప్రోగ్రాంలో భాగంగా సోమవారం సందర్శించింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. గంగదేవిపల్లిలో గ్రామాభివృద్ధి, ప్రజల స్వచ్ఛంధ భాగస్వామ్యం, అభివృద్ధి కమిటీల పనితీరును బృందానికి జిల్లా ట్రేయినింగ్ మేనేజరు కూసం రాజమౌళి వివరించారు. కార్యక్రమంలో బృందం సభ్యులు విక్రాంత్‌పునియా, అనిత్ కుమార్‌బర్తీ, ప్రదీప్ గుర్జార్, అమిత్‌కుమార్, సత్యంసింగ్ పాల్, తహసీల్దార్ రియాజుద్దిన్, ఎంపీడీవో కమలాకర్, ఎంపీవో ప్రభాకర్, ఆర్ఐ సాంబయ్య, ఏపీవో చంద్రకాంత్, ఏఎస్‌వో సతీష్, కూసం రమేష్, రుద్రప్రసాద్ పాల్గొన్నారు.

మహిళల సామాజిక బాధ్యత గొప్పది

సామాజిక బాధ్యతలో మహిళల పాత్ర ఎంతో గొప్పదని జిల్లా ట్రేయినింగ్ మేనేజర్ కూసం రాజమౌళి అన్నారు. సోమవారం సర్వోదయ సంస్థ ఆధ్వర్యంలో వర్ధన్నపేట మండలంకు చెందిన స్వయం సహాయక మహిళలు గంగదేవిపల్లిని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రంగంలో మహిళలు ముందుంటున్నారని, అక్షరాస్యత చైతన్య పరుస్తుందన్నారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, నవీన్, పూర్ణిమ, మంజుల, రమ, రజిత, విమల, రేణుక సంధ్య తదితరులు పాల్గొన్నారు.

విపక్ష రాష్ట్రాలకు బడ్జెట్‌లో మొండిచేయి


సమావేశంలో మాట్లాడుతున్న ఉపేందర్ రెడ్డి

గిర్మాజీపేట, జూలై 29: కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో బీజేపీ పాలిత, మద్దతు రాష్ట్రాలకు అధిక నిధులు కేటాయించి ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలకు మొండిచేయి చూపిందని ఎంసీపీఐ(యు) పొలిట్‌బ్యూరో సభ్యుడు వల్లేపు ఉపేందర్ రెడ్డి ఆరోపించారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వ బడ్జెట్ కార్పొరేట్ అనుకూల బడ్జెట్ అని విమర్శించారు. సోమవారం వరంగల్ నగరంలోని అండర్‌బ్రిడ్జి సమీపంలో ఎంసీపీఐ(యు) పార్టీ జిల్లా కార్యాలయ ఓంకార్ భవన్‌లో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గడ్డం నాగార్జున అధ్యక్షతన పార్టీ హనుమకొండ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాల ఆదాయాల ప్రాతిపదికన కేంద్రం బడ్జెట్‌లో ఆయా రాష్ట్రాలకు నిధులు కేటాయించాల్సి ఉండగా, మోదీ ప్రభుత్వం విపక్ష రాష్ట్రాలకు నిధుల కేటాయింపులో అన్యాయం చేసిందని ఆరోపించారు. వ్యవసాయ, విద్యా రంగాలకు నిధుల కేటాయింపు నామమాత్రమేనని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగులు ఆర్ఎస్ఎస్‌లో పనిచేయవచ్చంటూ కేంద్ర ప్రభుత్వం జీవో జారీ చేయడం భారత లౌకిక రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు.

సమావేశంలో పార్టీ కేంద్రకమిటీ సభ్యుడు గోనె కుమారస్వామి, పార్టీ హనుమకొండ జిల్లా కమిటీ కార్యదర్శి హంసారెడ్డి, సహాయ కార్యదర్శి నీల రవిందర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాస్ సావిత్రి, రాజిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, ఇంద్రారెడ్డి, ఉస్మాన్, బుచ్చయ్య, కిషన్, రమేష్, రాజేశ్వరావు, ప్రభాకర్,భద్రయ్య, రవిందర్, బాపురావు పాల్గొన్నారు.

కేఎం సారు కనబడాలే.. మాతో మాట్లాడాలే...

లేదంటే నిరాహారదీక్ష చేస్తా : కాంగ్రెస్ నాయకుడు కృష్ణ

సోషల్ మీడియాలో వీడియో వైరల్

వరంగల్ సిటీ, జూలై 29 : 'బీసీ నాయకుడైన కొండా మురళీధర్‌రావు (కేఎం) సారు మాకు కనపడాలె. మాతో మాట్లాడాలె. లేదంటే ఆయన కనిపించే వరకు పోచమ్మమైదాన్ జంక్షన్‌లో నిరాహార దీక్ష చేస్తా' అంటూ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మడిపెల్లి కృష్ణ చేసిన ఓ వీడియో ప్రకటన సోమవారం సోషల్ మీడియలో వైరల్ అయ్యింది. 33 ఏళ్ల రాజకీయ చరిత్రలో ఇలాంటి రాజకీయ పరిస్థితి చూడలేదని, తూర్పు నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసేందుకు కొండా మురళీధర్‌రావు నేతృత్వంలో తన లాంటి ఎందరో కార్యకర్తలు ఎంతో కష్టపడ్డారని గుర్తుచేశారు. కష్టకాలంలో ఎన్నో అవమానాలను కూడా భరించి ఆయనతో నడిచామన్నారు. కానీ ఇప్పుడు ఆయన్ను తమనుంచి దూరం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఆయన కనిపించి, తమతో మాట్లాడాలని లేకపోతే పోచమ్మమైదాన్ సెంటర్‌లో నిరాహార దీక్షకు దిగుతానంటూ చేసిన వీడియో వైరల్ నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది.

కేజీబీవీలోని సమస్యలను పరిష్కరించండి

వర్ధన్నపేట రూరల్, జూలై 29: మండలంలోని ఇల్లందలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని తెలంగాణ దళిత విద్యా వంతుల వేదిక జిల్లా కార్యదర్శి బట్టు సాంబయ్య డిమాండ్ చేశారు. సోమవారం సమస్యలను కలెక్టర్ సత్య శారదకు రిజిస్టర్ పోస్టు చేసినట్లుగా తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కనీస మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, చర్యలు తీసుకోవాలన్నారు.

సీపీఐ శిక్షణతరగతులను జయప్రదం చేయండి

ఖిలావరంగల్, జూలై 29: ఈనెల 30,31 తేదీల్లో జరిగే సీపీఐ సైద్ధాంతిక రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి కోరారు. సోమవారం శివనగర్‌లోని తమ్మెరభవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఖిలావరంగల్ మండల సమితి ఆధ్వర్యంలో హంటర్‌రోడ్‌లోని పీఆర్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో రెండు రోజులపాటు తరగతులు ఉంటాయన్నారు. ముఖ్యఅతిథులుగా సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కలపల్లి శ్రీనివాసరావు తదితరులు హాజరుకానున్నారన్నారు. కార్యక్రమంలో ఖిలావరంగల్ మండల కార్యదర్శి దండు లక్ష్మణ్, సహాయ కార్యదర్శి ఓర్సు రాజు, కార్యవర్గ సభ్యులు ఎమ్డీ అక్బర్‌పాషా, కౌన్సిల్ సభ్యులు ఎమ్డీ యాకూబ్, రాజేందర్ పాల్గొన్నారు.

ఆలయాలకు సీసీ కెమెరాల వితరణ

ఖిలావరంగల్, జూలై 29: పుప్పాలగుట్టలోని ముత్యాలమ్మ దేవాలయ అభివృద్ధి కోసం, శివనగర్ మొట్లబావి వద్దగల ధనమైసమ్మ దేవాలయానికి సీసీ కెమెరాల కోసం మెరుగు అశోక్ రూ.50వేలు వితరణ చేశారు. సోమవారం 34, 35 డివిజన్లలోని ముత్యాలమ్మ, ధనమైసమ్మ దేవాలయాలలో పూజలు చేసి, సీసీ కెమెరాల కోసం రెండు దేవాలయాలకు రూ.25వేల చొప్పున రూ.50వేలు అందజేశారు. అశోక్ జన్మదినం సందర్భంగా దేవాలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ముత్యాలమ్మ దేవాలయం చైర్మన్ ఎల్.శ్రీనివాస్, ధనమైసమ్మ కమిటీ కార్యదర్శి గుండు నాగరాజు, ఆలయకమిటీ కోశాధికారి చిన్నోజు విక్రమచారి, దేవాలయం అర్చకులు కాప వెంకటేశ్వర్లు, స్థానికులు గడ్డం రవి, కందుల కుమార్, అప్పికట్ల చిరంజీవి పాల్గొన్నారు.

తప్పిపోయిన వారిని అప్పగించిన పోలీసులు

కరీమాబాద్, జూలై 29: కుటుంబ కలహాలతో ఇంట్లోంచి వెళ్లిన భార్య, భర్త, కుమారుడిని తిరిగి కుటుంబ సభ్యులకు సోమవారం మిల్స్‌కాలనీ పోలీసులు అప్పగించారు. సీఐ మల్లయ్య కథనం ప్రకారం. ఏకశిలానగర్‌కు చెందిన గోనెల లింగమూర్తి, అతని భార్య వనమాల, కుమారుడు రాజ్‌కుమార్‌కు మధ్య కుటుంబ కలహాల కారణంగా ఈనెల 5న ముగ్గురు వేరువేరుగా ఇంట్లోంచి వెళ్లిపోయారు. రెండు రోజులుగా తన తల్లిదండ్రులు, సోదరుడు కనిపించడం లేదంటూ లింగమూర్తి కుమార్తె రావుల అశ్విని ఫిర్యాదుతో ఈనెల 8న పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు సోమవారం కుటుంబ సభ్యుల ఆచూకీ కనుగొని తన తల్లిదండ్రులను, సోదరుడిని రావుల అశ్వినికి అప్పగించారు.

ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

మట్టెవాడ, జూలై 29: రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించి, నెలకు రూ.18వేల వేతనం ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర నాయకురాలు కాసు మాధవి డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం 30న సీఐటీయూ చలో హైదరాబాద్ కార్యక్రమానికి పిలుపునిచ్చింది. హైదరాబాద్ వెళుతుండగా ఆశా వర్కర్లను, సీఐటీయూ నాయకులను ముందస్తుగా సోమవారం మట్టెవాడ పోలీసులు అరెస్టు చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి, ఎం.అనిత, మరియారాణి, కవిత,సంధ్య, నాగమణి, గౌస్య, సోని, అనిత ఉన్నారు.

అనారోగ్యంతో వృద్ధుడి మృతి

శంభునిపేట, జూలై 29: అనారోగ్యంతో వృద్ధుడు మృతి చెందిన ఘటన సోమవారం మామునూరులో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గుర్తు తెలియని వృద్ధుడు (70) ఆరేళ్లుగా మామునూరు బస్ షెల్టర్‌లో తలదాచుకుంటున్నాడు. గ్రామస్థులు, బాటసారులు ఇచ్చిన ఆహారం తింటూ ఉండేవాడు. సోమవారం బస్ షెల్టర్‌లో విగతజీవిగా పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు 43వ డివిజన్ కార్పొరేటర్ ఈదురు అరుణవిక్టర్‌కు, పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్ఐ కృష్ణవేణి ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. వృద్ధుని ఆచూకీ తెలిసిన వారు మామునూరు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

స్థలం పేరుతో మోసం చేశారు..

• నలుగురిపై కేసు నమోదు
• తన తండ్రిని పోలీసులు వేధిస్తున్నారని టవర్ ఎక్కిన యువకుడు


టవర్ ఎక్కి ఆందోళన చేస్తున్న యువకుడు మురళి

కరీమాబాద్, జూలై 29: స్థలం కొనుగోలు పేరుతో పలుమార్లు డబ్బులు తీసుకుని, స్థలం ఇవ్వకుండా మోసగించిన వారిపై మిల్స్‌కాలనీ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ మల్లయ్య కథనం ప్రకారం. కరీమాబాద్‌కు చెందిన మామిండపల్లి సారంగపాణి అతని సోదరులకు చెందిన ఆస్తి పంపకాల విషయంలో సమస్యలు తలెత్తాయి. వీటిని పరిష్కరించేందుకు ఓసిటీ ప్రాంతంలోని ఎస్ఆర్‌నగర్‌కు చెందిన కుదురుపాక వెంకటేశ్వర్లు, వివేకానంద కాలనీకి చెందిన కె.సతీష్‌లను సంప్రదించారు. పంపకాలు జరిగిన అనంతరం సారంగపాణికి వాటాకు వచ్చిన ఆస్తి తాలూకు డబ్బుపై వెంకటేశ్వర్లు, సతీష్, వెంకటేశ్వర్లు భార్య కుదురుపాక అనిత, కుమారుడు జయప్రకాష్‌లు ప్లాన్ వేశారు. ఈ క్రమంలో నగదు ఉంటే ఖర్చవుతుందని, ఆడపిల్లలకు పెండ్లి సమయంలో ప్లాటు ఇస్తే రేటు రెట్టింపు అవుతుందని సారంగపాణి, అతని భార్య ధనలక్ష్మిని నమ్మించారు. తన వద్ద డిమాండ్ ఉన్న ఓపెన్ ప్లాటు ఉందని చెప్పి ఏనుమాముల మార్కెట్ సమీపంలోని 265 చదరపు గజాల ప్లాటును రూ.30.21లక్షలకు అగ్రిమెంట్ చేసుకున్నారు. అందులో రూ.20లక్షలు అడ్వాన్స్‌గా సతీష్‌కు డబ్బులు చెల్లించి రశీదులను వెంకటేశ్వర్లు, సారంగపాణి దంపతులకు ఇప్పించాడు.

కొద్ది రోజులకు సారంగపాణి దంపతులతో మీరు చేసుకున్న అగ్రిమెంట్ సమయం అయిపోయిందని, సతీష్ మీకు ప్లాట్ ఇవ్వడం కుదరదని అంటున్నాడని, మీరు అడ్వాన్స్‌గా ఇచ్చిన డబ్బులు కూడా ఇవ్వనంటున్నాడని వెంకటేశ్వర్లు చెప్పుకొచ్చాడు. దానికి బదులుగా గాంధీనగర్‌లోని 90 చదరపు గజాల్లో ఇంటి నిర్మాణం చేసి ఇస్తామని చెప్పగా పలుమార్లు వెంకటేశ్వర్లు కుమారుడైన కుదురుపాక జయప్రకాష్ ఖాతాకు డబ్బులు కట్టించుకొని మరోసారి సారంగపాణి దంపతులను మోసం చేశారు. ఆ తరువాత ముందుగా అగ్రిమెంట్ చేసుకున్న 265 గజాల స్థలాన్ని సారంగపాణికి తెలియకుండా సతీష్ సహకారంతో వెంకటేశ్వర్లు తన పేరుపై రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. దీంతో తమకు భూమి వద్దు, ఇల్లు వద్దు తాము చెల్లించిన డబ్బులు తిరిగి చెల్లించాలని మూడు నెలల క్రితం ఫోన్ చేసి అడుగగా దుర్భాషలాడాడు. ఇదే విషయాన్ని ఈనెల 17న పెద్దమనుషుల సమక్షంలో డబ్బులు ఇవ్వాలని అడుగగా.. బెదిరింపులకు పాల్పడ్డాడు. తమను మోసం చేసిన వెంకటేశ్వర్లు, అతడి భార్య అనిత, కుమారుడు జయప్రకాష్, స్థలం మొదట అగ్రిమెంట్ చేసిన సతీష్‌పై విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని కోరుతూ బాధితురాలు మామిండ్లపల్లి సారంగపాణి భార్య ధనలక్ష్మి పదిరోజుల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

తన తండ్రిని పోలీసులు వేధిస్తున్నారని

మిల్స్‌కాలనీ పోలీసులు తన తండ్రి కుదురుపాక వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసి వేధిసున్నారంటూ ఎస్ఆర్‌నగర్‌కు చెందిన వెంకటేశ్వర్లు కుమారుడు జయప్రకాష్ సోమవారం ఉదయం ఏనుమాముల సబ్‌స్టేషన్ వద్ద టవర్ ఎక్కి ఆందోళన చేపట్టాడు. విషయం తెలుసుకున్న ఏనుమాముల సీఐ పులి రమేష్, ఎస్ఐ శ్రీకాంత్‌లు యువకుడితో మాట్లాడి సీపీ కార్యాలయంలో సంప్రదించి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. దీంతో ఆయన కిందికి దిగడంతో సమస్య సద్దుమణిగింది.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL మంగళవారం 30 జూలై 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

కేజీబీవీలోని సమస్యలను పరిష్కరించండి

వర్ధన్నపేట రూరల్, జూలై 29 : మండలంలోని ఇల్లందలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని తెలంగాణ దళిత విద్యా వంతుల వేదిక జిల్లా కార్యదర్శి బట్టు సాంబయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు సమస్యలను జిల్లా కలెక్టర్ సత్య శారదకు రిజిస్టర్ పోస్టు చేసినట్లుగా తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేజీబీవీలో కనీస మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వాటిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. వెంటనే తగు చర్యల కోసం నిధులు కేటాయించాలని కోరారు. వరంగల్ ఎంపీ కడియం కావ్యను సైతం ఫోన్‌లో సంప్రదించగా త్వరలోనే కేజీబీవీని విజిట్ చేస్తానని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అనిల్, సురేష్, సత్యం, రవి తదితరులు పాల్గొన్నారు.

పల్లె బాగోగులపై కేంద్ర బృందం పర్యటన

• ఇల్లందలో ఆరు రోజుల పాటు పర్యవేక్షణ



కేంద్ర బృందం సభ్యులకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంపీడీవో

వర్ధన్నపేట రూరల్, జూలై 29 : పల్లెల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, అధికారులు తీసుకుంటున్న చర్యలు, వారి విధి నిర్వహణపై కేంద్ర బృందం ఆరు రోజుల పాటు పర్యటించనుంది. సోమవారం వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని ఇల్లందకు చేరుకున్న సెంట్రల్ టీంకు వర్ధన్నపేట ఎంపీడీవో వెంకటరమణ, ఎంపీవో ధనలక్ష్మిలు స్వాగతం పలికారు. ఐదుగురు సభ్యులతో కూడిన సెంట్రల్ అసిస్టెంట్ సెక్షన్ అధికారులు గ్రామపంచాయతీ నిర్వహణపై దృష్టి సారించనున్నారు. మొదటి రోజులో భాగంగా గ్రామ పంచాయతీలోని రికార్డులను పరిశీలించారు. పంచాయతీ ఆధ్వర్యంలో గ్రామంలో జరుగుతున్న పలు పనులు, పరిశుభ్రత, ఇతర వాటిని అడిగి తెలుసుకున్నారు. నేడు మహాత్మా గాంధీ ఉపాధిహామీ పథకంలో చేసిన పనులు, వాటి వివరాలు తెలుసుకోనున్నారు. ఆరు రోజుల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, ప్రభుత్వ పాఠశాలల పని తీరు, సెర్ప్, మహిళా సంఘాలు, వ్యవసాయం, ఆరోగ్యం, పోలీసుల పనితీరుపై అధ్యయనం చేయనున్నారు. ఆగస్టు 3వ తేదీ వరకు ఈ పర్యటన సాగుతుందని సెంట్రల్ టీం స్పష్టం చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో జరిగే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ అభివృద్ధి పథకాలను పరిశీలించి అధ్యయనం చేయుటకు మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతున్నట్లు అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో నాగేశ్వర్‌రావు, ఏపీఎం వేణు, సీసీ గోలి కొమురయ్య, కార్యదర్శి రామారావు, వీవోఏలు శోభ, రమ్య, స్రవంతి, రమా, అంగన్‌వాడీ కార్యకర్తలు మాధవి, భారతి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి



సారంగం (ఫైల్)

దుగ్గొండి, జూలై 29 : ఆర్థిక ఇబ్బందులతో తాగుడుకు బానిసగా మారి జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని నాచినపల్లిలో సోమవారం చోటు చేసుకొంది. ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. నాచినపల్లికి చెందిన దూడెల సారంగం(45) గ్రామంలో ఓ యజమాని దగ్గర పాలేరుగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటాడు. సారంగంకు కుమారుడు సిద్ధు, కుమార్తె కీర్తన, భార్య సునీత ఉన్నారు. కుమారుడు ఇంజనీరింగ్ చదువుతుండగా, కుమార్తె డిగ్రీ చదువుచున్నది. సారంగం పాలేరు పనితో పాటు గ్రామంలో ఎకరంన్నర భూమి కౌలుకు తీసుకొని సాగుచేస్తున్నాడు. పిల్లల చదువులు, వ్యవసాయ పనుల పెట్టుబడుల కారణంగా సారంగంకు అప్పులు అయ్యాయి. దీంతో సారంగం తాగుడుకు బానిసగా తయ్యారయ్యాడు. జీవితంపై విరక్తి చెంది ఈ నెల 27న కౌలుకు తీసుకున్న భూమి దగ్గరకు పోయి పురుగుల మందు తాగాడు. చికిత్స కోసం నర్సంపేట ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకపోగా, చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై వెల్లడించారు. మృతుడి కుమారుడు దూడెల సిద్ధు సోమవారం ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ముదిరాజ్ సమస్యలపై దశల వారీ ఉద్యమం

దుగ్గొండి, జూలై 29 : ముదిరాజ్ కులస్థుల సమస్యలపై దశల వారిగా ఉద్యమం చేపడతామని మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పల్లె రమేశ్ అన్నారు. మండలంలోని గిర్నిబావిలో సోమవారం వివిధ గ్రామాలకు చెందిన ముదిరాజ్ సంఘాల అధ్యక్షుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముదిరాజ్ కులస్థులను బీసీ- డీ నుంచి ఏ లో చేర్చాలని, చేప పిల్లల బదులు సంఘాలకు నగదుగా చెల్లించాలన్నారు. 75శాతం సబ్సిడీపై వాహనాలు అందించాలని, కార్పొరేషన్‌కు రూ:1000 కోట్లు చెల్లించాలన్నారు. మంగళవారం తహసీల్దార్‌కు సమస్యలపై వినతి పత్రం ఇవ్వనున్నట్లు, ఎక్కువ సంఖ్యలో కదిలి రావాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మొగిలి, రాజ్‌కుమార్, పలు గ్రామాల సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

గుట్ట గుల్ల!

మైనింగ్ పేరుతో అడ్డగోలు తవ్వకాలు

వన్యప్రాణుల వేటకు ఉచ్చులు

ఇబ్బందులు పడుతున్న రైతులు



పెద్దగుట్ట వద్ద ప్రభుత్వ భూమిలో తవ్వకాలు



తవ్వకాల వల్ల కూలిపోయే స్థితిలో విద్యుత్ స్తంభం



వేట కోసం ఏర్పాటు చేసిన బైండింగ్ వైరు

పర్వతగిరి, జూలై 29 : మైనింగ్‌తవ్వకాల పేరుతో గుట్టను గుల్ల చేస్తున్నారు. అనుమతి తీసుకున్నది కొంతమేరకైతే గుట్టకు చుట్టు పక్కల ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరుపుతున్నారు. గుట్టతో పాటు అటవీ ప్రాంతంలో సంచరించే వణ్యప్రాణుల వేట కోసం విద్యుత్ ఉచ్చులు బిగిస్తున్నారు. మండలంలోని ఏనుగల్లు గ్రామ శివారు గుగులోత్‌తండాలో ఉన్న పెద్దగుట్టను మైనింగ్ పేరిట లీజుకు తీసుకున్నారు. గుట్ట చుట్టూ సుమారు 50 ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఉండడంతో ఆ భూమిలో తవ్వకాలు చేపట్టి మట్టిని యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. మట్టితో పాటు ప్రభుత్వ భూముల్లో ఉన్న రాళ్లను ఇంటి బేస్‌మెంట్‌కు వినియోగించే రాళ్లుగా, కంకరగా మలచి తరలిస్తున్నారు.

ఉచ్చులతో వన్యప్రాణుల వేట

గుట్టతోపాటు చుట్టుపక్కల ప్రాంతమంతా నిర్మానుష్యంగా, చిట్టడివి మాదిరిగా ఉండడంతో వణ్యప్రాణులు సంచరిస్తుంటాయి. ముఖ్యంగా నెమళ్లు ఆ ప్రాంతం లో ఎక్కువగా తిరుగుతుంటాయి. వణ్యప్రాణుల వేటకోసం గుట్ట పైకి ఎక్కే దారిలో ఇరువైపులా సన్న బైండింగ్ వైరు పరిచి దాని చివరకు రాత్రివేళల్లో విద్యుత్‌తో కనెక్షన్ ఇస్తారు. రాత్రిపూట మేత, నీళ్ల కోసం వచ్చిన వణ్యప్రాణులకు షాక్ కొట్టి మరణిస్తాయి. ఇలా గుట్టపై దారిలో ఇరువైపులా విద్యుత్ ఉచ్చులు బిగిస్తున్నా సంబం ధిత అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలు వస్తున్నాయి.

విధ్వంసంతో ఇబ్బందులు పడుతున్న రైతులు

మైనింగ్ కోసం గుట్టకు బాంబులు అమర్చి పేలుస్తుండడంతో చుట్టుపక్కల రైతుల పొలాల్లో పెద్దపాటి బండరాళ్లు పడుతున్నాయి. గుట్టచుట్టూ తవ్వకాలతో బావులు పూడుకుపోతున్నాయి. బోరుబావులు ఎండిపోతున్నాయి.పెద్దరాళ్లను క్రషర్ మిషన్‌లో వేసి కంకరగా మార్చే క్రమంలో పెద్దఎత్తున రాళ్లదుమ్ములేసి సమీప పొలాల్లో పడుతోంది. ఈ విషయాన్ని క్రషర్ నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని పలువురు రైతులు వాపోతున్నారు. ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు జరపడంతో రైతుల పొలాలకు వెళ్లే విద్యుత్‌స్తంభాలు కూలిపోయే పరిస్థితుల్లో ఉన్నాయి. ప్రభుత్వ భూమిలో మట్టి, రాళ్ల తవ్వకాలు చేపట్టడంతో ఇదేమిటని ప్రశ్నించిన పలువురు గ్రామస్థులపై కేసులు నమోదుచేయించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టిసారించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

డ్రెయినేజీ ఇలా.. మురుగునీరు పోయేదెలా?



బస్టాండ్ ఏరియాలో మురుగు కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారం

వర్ధన్నపేట, జూలై 29: అస్థవ్యస్థ డ్రైనేజీ వ్యవస్థతో వర్ధన్నపేట పట్టణంలోని ప్రజలు మురుగునీరు కాల్వల్లోనే నిలిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టించుకోవాల్సిన మునిసిపల్ శానిటేషన్ విభాగం అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మునిసిపాలిటీలోని 12 వార్డుల్లో డ్రైనేజీ కాలువల్లో చెత్తా చెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతుంది. వరసగా వారం రోజులపాటు కురుస్తున్న వర్షాలతో చిత్తడిగా తయారై దోమలు, ఈగలు స్వైర విహారం చేస్తున్నాయి. ఏడాది తరువాత దోమలకు ఫాగింగ్, బ్లీచింగ్ పౌడర్‌పేరుతో సున్నం నీరునిలిచిన చోట్లవేసి మమ అనిపిస్తున్నారు.

పదిమంది పీహెచ్ వర్కర్లకు ఇద్దరు పర్యవేక్షకులు

వర్ధన్నపేట మున్సిపాలిటీలో ప్రస్తుతం 8 మంది కార్మికులు రోడ్లు శుభ్రం చేయడానికి 2 కార్మికులు డ్రైనేజీలు శుభ్రం చేసేందుకు విధులు నిర్వర్తిన్నారు. ఈ 10 మంది కార్మికులతో పనులు చేయించడానికి మునిసిపల్ కమిషనర్ ఒక శానిటేషన్ ఇన్‌స్పెక్టర్, మరొక శానిటేషన్ అసిస్టెంట్ సూపర్‌వైజర్లను నియమించారు. వీరికి పనులు తక్కువ ఆర్భాటం ఎక్కువలా ఉంది. పారిశుధ్య పనుల కన్నా స్వలాభం ఇతర పనుల్లో తలామునకలై పోతున్నారు. ఈ ఇద్దరు శానిటేషన్ సూపర్‌వైజర్లు ఫొటోలకు ఫోజులిచ్చేందుకే పరిమితమవుతుండడంతో మునిసిపాలిటీ పరిధిలో పారిశుధ్యపనులు ఎక్కడికక్కడే ఉంటున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.ఇద్దరు కార్మికులతో పట్టణంలోని డ్రైనేజీలు శుభ్రంచేయలేకపోతున్నారని వర్షాకాలం దృష్ట్యా డ్రైనేజీలు శుభ్రంచేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఉద్యమకారుడి కుటుంబాన్ని ఆదుకోవాలి



సీఎంకు విజ్ఞాపన పత్రం పంపిస్తున్న సాంబయ్య

నల్లబెల్లి, జూలై 29 : అనారోగ్య, ఆర్థిక సమస్యలతో ఇటీవల వరంగల్‌లో రైలు పట్టాలపై తలపెట్టి ఆత్మహ త్య చేసుకున్న ఉద్యమ కారుడు వడ్లూరి సత్యం కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని దళిత విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి బట్టు సాంబయ్య తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని పోస్టాఫీస్ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞాపన పత్రాన్ని పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమ కారుడి కుటుంబానికి రూ.25లక్షల ఎక్స్‌గ్రేషయా ప్రకటించాలని ప్రభుత్వాన్నికోరారు. కుటుం బంలోని ఒకరికి ప్రభుత్వఉద్యోగం కల్పించాలన్నారు. అంతేగాకుండా సొంత ఇల్లు నిర్మాణంతో పాటు ఉద్యమ కారుడు కూతురి చదువును ప్రభుత్వమే భరించాలన్నారు. కార్యక్రమంలో ఉద్యమకారులు పులి రమేష్‌గౌడ్, బొమ్మ కంటి అనిల్, సురేష్, సత్యం రవి పాల్గొన్నారు.

వన మహోత్సవ వేడుకలు

చెన్నారావుపేట, జూలై 29 : మండలంలోని పాపయ్యపేటలో గీత కార్మిక సంఘం వారి ఆధ్వర్యంలో సోమవారం వన మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఎక్సైజు సీఐ నరేష్ రెడ్డి గీత కార్మికులతో కలిసి తాటి, ఈత మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటిన మొక్కలను కాపాడుకోవాలన్నారు. గౌడ సంఘం అధ్యక్షుడు కత్తి స్వామి, మేడి సుధాకర్, మాజీ అధ్యక్షుడు బండి రమేష్. బుర్ర సుదర్శన్‌గౌడ్, యాదగిరి, రామగోని రదిగౌడ్, సతీష్‌గౌడ్. హెడ్ కానిస్టేబుల్ లింగేశ్వర్, రాంమూర్తి, సుధీర్, నాగరాజు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి



నిరసన వ్యక్తం చేస్తున్న దళిత నాయకులు

నర్సంపేట. జూలై 29 : పట్టణంలోని 121 సర్వే నంబర్ ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుంచి కాపాడి ప్రభుత్వం స్వాధీనం చేసుకో వాలని దళిత, ప్రజాసంఘాల జేఏసీ కన్వీనర్ గద్ద వెంకటేశ్వర్లు, ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షుడు కల్లెపల్లి ప్రణయదీప్, దళిత, ప్రజాసంఘాల జేఏసీ కో-కన్వీనర్లు గుంటి వీరప్రకాశ్, మంద ప్రకాశ్ డిమాండ్‌చేశారు. పట్టణంలోని అంబే ద్కర్ సెంటర్‌లో దళిత,ప్రజాసంఘాల జేఏసీ, ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి, డీబీఆర్పీఎస్ ఆధ్వ ర్యంలో నిరసన నిర్వహించి, అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోకుంటే దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అణగారిన ప్రజలతో గుడిసెలు వేయిస్తామని పేర్కొన్నారు 121 సర్వే నంబర్‌ను కొందరు 129నంబర్‌గా చూపుతున్నారని వారు ఆరోపించారు. 121 సర్వే నంబర్ భూమిని కాపాడాలని వారు కోరారు. కార్య క్రమంలో కేదారి, ఆగారపు స్వామి, బానాల శ్రీను. మాదాసి రవి, కోడి భాస్కర్, చింతం సిద్ధు, ఈశ్వర్, అఖిల్, ఇస్రం కుమార్, గద్ద సారంగం, వేల్పుల సురేశ్, మల్లయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బాలో నారాయణరెడ్డి జయంతి

చెన్నారావుపేట, జూలై 29 : మండల కేంద్రలోని కస్తూర్బా గురుకుల విద్యాలయంలో ప్రముఖ కవి, గేయ రచయిత సింగిరెడ్డి నారాయణరెడ్డి 93వ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు ఉపన్యాసం పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తేజస్వీదేవిక. కమల తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి..



ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ నర్సయ్య

వర్ధన్నపేట, జూలై 29 : రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఆటో డ్రైవర్లు తగిన జాగ్రత్తలు పాటించాలని వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య అన్నారు. సోమవారం వర్ధన్నపేటలో ఆటో డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలు జరుగకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ నర్సయ్య మాట్లాడుతూ హై వేలో వెళ్లే టప్పుడు యూ టర్న్ వద్ద తగిన జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ఆటోలో ప్రయాణించేటప్పుడు తల్లిదండ్రులు, పిల్లలను గుర్తుకు తెచ్చుకోవాలని సూచించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాద ఘటన పునరావృత్తం కా కుండా చూసుకోవాలని సూచించారు. అదేవిధంగా ద్విచక్ర వాహనాలపై ఇద్దరి కంటే ఎక్కువ మంది ప్రయాణించవద్దని అన్నారు. కార్యక్రమంలో ఎస్సై ప్రవీణ్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బురద రోడ్డుతో అవస్థలు



తిమ్మంపేట నుంచి వ్యవసాయ బావులకు వెళ్లే రోడ్డు

దుగ్గొండి, జూలై 29 : ఇటీవల కురిసిన వర్షాలతో రహదారి బురదగా తయారైంది. వ్యవసాయ పనులకు పక్క గ్రామమైన రామవరం రైతులు, ప్రజలు అవస్థలుపడుతూ వెళ్తున్నారు. మండలంలోని తిమ్మంపేట నుంచి నాం చెరువు, రామవరం వెళ్లే రోడ్డు బురదగా తయారైంది. రైతులు ప్రతీ రోజు నరకయాతన పడుతూ పనులకు వెళ్తున్నారు. గత ఏడాది రోడ్డు బురదగా మారడంతో రైతులు రోడ్డుకు సొంతంగా మొరం పోసుకున్నారు. ఇటీవల వరసగా కురిసిన వర్షాలతో రోడ్డు మళ్లీ బురదగా తయారైంది. గ్రామ చివర పురుషుల పొదుపు సంఘం భవనం ఉండడంతో ఆ రోడ్డు నుంచే పొదుపు సంఘం భవనం దగ్గరకు పోవలసి వస్తోందని గ్రామస్థులు తెలుపుతున్నారు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలి

కందకట్ల మదన్‌మోహన్, రైతు, తిమ్మంపేట



ఇటీవల కురిసిన వర్షాలతో రోడ్డు బురదగా తయారైంది. ప్రతీ రోజు అవస్థలు పడుతూ వ్యవసాయ బావుల దగ్గరకువెళ్లతున్నాం. ప్రతీ ఏడాది వర్షాకాలంలో బురద రోడ్డుతో నరకయాతన పడుతున్నాం. రోడ్డు నిర్మాణం కోసం పలు సార్లు గ్రామంలో జరిగిన గ్రామ సభల నందు గోడు వెల్లబుచ్చినా నిర్మాణానికి నోచుకో లేదు. ఇప్పటికైన అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలి. బురద రోడ్డు నుంచి విముక్తి చేయాలి.

తపాలా బీమా చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సైదానాయక్

చెన్నారావుపేట, జూలై 29 : తపాలా బీమాను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తపాలాశాఖ ఐపీవో లవేరీ సైదానాయక్ అన్నారు. సోమవారం మండలంలోని అమీనాబాద్ గ్రామంలోని తపాలశాఖ కార్యాలయంలో తపాలా బీమా పథకాలపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తపాలా కార్యాలయంలో ఉన్న సుకన్య యోజన పథకం, కిసాన్ వికాస్ యోజన పథకం, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, నేషనల్ సేవింగ్ సర్టిఫికెట్, 5 సంవత్సరాల ఫిక్సిడ్ డిపాజిట్‌లతో పాటు బీమా పథకాలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మెయిల్ ఓవర్ వేణుగోపాల్, బీపీఎం రూపారెడ్డి ప్రభాకర్ రెడ్డి, సాంబరెడ్డి, విజయ్, సుజాత పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ని నమ్మేస్థితిలో లేరు

వర్ధన్నపేట, జూలై 29 : బీఆర్‌ఎస్ పార్టీ పదేళ్ల పాలనపై ప్రజలు విరక్తి చెంది కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించారని, బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నిచెప్పినా వారి మాటలను ప్రజలు నమ్మే స్థితిలోలేరని కాంగ్రెస్ పార్టీ వర్ధన్నపేట పట్టణ అధ్యక్షుడు మైస సురేష్‌కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటినుంచి నేటి వరకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశలవారీగా తీర్చుతూ ముందుకు సాగుతుండడంతో ఓర్వలేక తమకు భవిష్యత్‌లో పుట్టగతులుండవని భావించి తప్పుడు ప్రచారం చేయడం, వారి దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి అక్రమాలు బయట పడుతుండడంతో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వారికి పుట్టగతులుండవన్నారు.

కాంగ్రెస్ అంటేనే కరువుకు కేరాఫ్

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రాయపర్తి, జూలై 29 : పదేండ్ల బీఆర్‌ఎస్ పాలన చూసిన ప్రజలు ఎంతో సంతో షంగా ఉన్నారని, ఏడు నెలల్లో కాంగ్రెస్ పాలన పట్ల ప్రజలు చిదరించుకుంటున్నారని, కాంగ్రెస్ అంటేనే కరువుకు కేరాఫ్ అడ్రస్ అంటూ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఎద్దేవా చేశారు. సోమవారం మండలకేంద్రంలోని బీఆర్‌ఎస్ మండలపార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశంల ఏర్పాటుచేశారు. ఆయన మాట్లాడుతూ అమలుకాని అడ్డగోలు హామీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మధ్యపెట్టిన కాంగ్రెస్ ఇప్పుడు వాటి అమలుకు పూటకో మాట మాట్లాడుతోందని విమర్శించారు. రాష్ట్రంలో పెన్షన్లు, మహిళలకు రూ. 2500, రైతు బంధు లాంటి ముఖ్య పథకాలను పక్కన పెట్టి, దాటవేత ధోరణి ప్రదర్శిస్తున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ బండారం బయట పడుతుందని అప్పటి వరకు ఓపికతో ఉండాలని వివరించారు. నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటూ కష్టసుఖాల్లో పాలుపంచుకుంటానని తెలిపారు. సోషల్ మీడియాలో నాపై వస్తున్న పుకార్లను నమ్మవద్దని స్పష్టం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. గ్రామాల్లో సమావేశాలు పెట్టి అందరినీ చైతన్య వంతం చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మునావత్ నర్సింహనాయక్, మాజీ ఎంపీపీ జీనుగు అనిమిరెడ్డి, మాజీ జడ్పీటీసీ రంగు కుమార్, ఆకుల సురేందర్ రావు, నయీం తదితరులు పాల్గొన్నారు.

పండ్లతోటల సాగుకు రాయితీ

ఈ నెల చివరి వరకు దరఖాస్తుకు అవకాశం

రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

వర్ధన్నపేట, జూలై 29 : ప్రజల అవసరాలకు అనుకూలంగా కూరగాయలు, పండ్ల ఉత్పత్తి లేకపోవడంతో ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. మరోవైపు దిగుబడులు తగ్గడంత మార్కెట్‌లో డిమాండ్ ఏర్పడింది. ఈ నేపథ్యంలో పండు, కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్‌ల రైతులను పండ్ల తోటల పెంపకం వైపు మళ్లించేందుకు రాయితీలు అందిస్తుంది. ప్రతీ మొక్కకు నీటిని అందించేందుకు సబ్సిడీపై సూక్ష్మసేద్యపు పరికరాలుఇవ్వనుంది. వర్ధన్నపేట మండలంలో ఇప్పటికే 150 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం, కూరగాయల సాగుకు అనుకూలమైనదిగా గుర్తించి సాగుకు సమాయత్తమవుతున్నారు.

ఉద్యాన పంటలకు..

ఉపాధిహామీ, ఉద్యాన శాఖల ఆధ్వర్యంలో 14 రకాల పండ్ల తోటలు సాగు చేసేందుకు అవకాశం ఉంది. ప్రస్తుతం వాతావరణ మార్పులు, పరిస్థితులు, ఆరోగ్య, సంరక్షణ, డెంగీ తదితర వైరస్‌లతో అనారోగ్య లక్షణాల నుంచి సంరక్షణకు రోగ నిరోధక శక్తి పెరగాలంటే డ్రాగన్ ఫ్రూట్, జామ, నిమ్మ, నేరేడు తదితర పంటల పండ్లతోపాటు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కూరగాయల సాగుచేసుకోవాలి. అంతర పంటలుగా ఆకు కూరలు, బీర, సోర, కాకరకాయ, చిక్కుడు, టమాట, దోస, మునగ, పూలు సాగు చేయవచ్చు.

పంట	ఎకరాకు మొక్కలు	ఎకరానికి ఇచ్చే రూపాయలు
మామిడి	70	54,608
నిమ్మ	110	69,403
నారింజ	100	63,118
జీడిమామిడి	70	54,186
జామ	110	70,063
సీతాఫలం	100	1,00,986
సపోటా	60	47,264
ఆయిల్‌పాం	57	43,946
నేరేడు	40	31,120
ఆపిల్ బేర్	160	77,786
దానిమ్మ	265	1,21,499
మునగ	1000	94,892
డ్రాగన్ ఫ్రూట్	900	2,50,272
కొబ్బరి	40	31,500

అర్హతలు

ఉపాధిహామీ జాబ్‌కార్డు కలిగి ఉండి అనువైన భూమి, నీటి సౌకర్యం ఉండాలి. 5 ఎకరాలలోపు భూమి ఉన్న షెడ్యూల్డ్ కులాలకు చెందిన చిన్నసన్నకారు రైతులైఉండాలి. రైతులకు రాయితీపై మొక్కలు, బిందు సేద్యం పరికరాలు, ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం సబ్సిడీతో పరికరాలు అందజేయనున్నారు. మొక్కలు నాటిన ఏడాది నుంచి 3 నుంచి 4ఏళ్ల వరకు నిర్వహణ ఖర్చులు ప్రభుత్వమే మంజూరు చేస్తుంది. ప్రభుత్వమే నెలాఖరులోగా ఉద్యానవన శాఖ సమన్వయంతో లబ్ధిదారులను ఎంపికచేస్తుంది. అన్నదాతలు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. ఈ నెలాఖరు వరకు లబ్ధిదారులను గుర్తించి ఆగస్టు15లోపు ప్రతిపాదనలు రూపొందిస్తారు. వచ్చే నెల వరకు మొక్కలునాటడం, బిందుసేద్యం పరికరాల బిగించడం పూర్తిచేయాల్సి ఉంటుంది.

మొక్కలు నాటేందుకు అనువైన సమయం

నాగేశ్, ఏపీవో, వర్ధన్నపేట

ఉపాధిహామీ పథకంలో భాగంగా 2023-24 సంవత్సరానికిగాను పండ్ల తోటల పెంపకానికి ఇది అనుకూల సమయం. రైతులకు ఎలాంటి ఖర్చు లేకుండా మూడేళ్లపాటు యాజమాన్య పద్ధతులను ప్రభుత్వమే భరిస్తుంది. అర్హత, ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తులను ఉపాధిహామీ కార్యాలయంలో ఏపీవోకు అందజేయాలి. రాయితీని నగదు రూపంలో రైతు బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. మండలంలో ఇప్పటికే 80 ఎకరాల్లో సాగు చేస్తుండగా మరో 70 ఎకరాలకు అవకాశం ఉంది.